# లోకల్ గైడ్

జాతీయ దినపత్రిక

LOCAL NEWS GOBAL FOCUS

LGTV

తెలంగాణ www.localguidenews.com RNI No:APBIL/2013/50718 ఆంధ్రప్రదేశ్

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 14, | సంచిక 200, | పేజీలు -12 | మంగళవారం - 19 - మే - 2026 | వెల రూ.2/-

PUBILSHED FROM RANGAREDDY, HYDERABAD, circulated by Adilabad,Bhadradri Kothagudem,Hanumakonda. Jagtial,,Jangoan,Jayashankar Bhupalapally,Jogulamba Gadwal, Kamareddy,Karimnagar,Khammam, Kumuram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak ,Medchal Malkajgiri, Mulugu, Nagarkurnool,Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, Yadadri Bhuvanagiri







## తిరుమల కొండల్లో పచ్చదనం..

## అటవీ సంరక్షణలో దేశానికే ఆదర్శంగా టీటీడీ

అటవీ సంరక్షణలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిన టీటీడీ




- శేషాచల కొండల్లో 89.40 శాతానికి చేరిన పచ్చదనం
- అక్రమ నరికివేత, వేట నివారణకు 24 గంటల పటిష్ట నిఘా
- వన్యప్రాణుల సంరక్షణ, జీవ వైవిధ్యంపై ప్రత్యేక దృష్టి
- విదేశీ మొక్కల స్థానంలో గంధం, ఎర్రచందనం పెంపకం

తిరుపతి: తిరుమల పుణ్యక్షేత్రం అనగానే శ్రీవారి దివ్యమంగళ స్వరూపంతో పాటు పచ్చని గిరులు కళ్లముందుకొస్తాయి. ఆ పవిత్ర శేషాచల కొండలు ఇప్పుడు పచ్చదనంతో మరింత కళకళలాడుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం మిగతా..2లో

# ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఫోకస్

- ఖాతాల్లోకి రూ.4520 కోట్లు జమ
- 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం
- ధాన్యం తరలింపునకు 11,500 వాహనాలు
- తెలంగాణలోని రైతులకు అదిరిపోయే గుడ్ న్యూస్



హైదరాబాద్: తెలంగాణలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వ గుడ్‌న్యూస్ తెలిపింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి నగదును రైతుల ఖాతాలోకి జమ చేసింది. ఇప్పటి వరకు 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన తెలంగాణ ప్రభుత్వం అందుకు సంబంధించి రైతుల ఖాతాలోకి రూ.4520 కోట్లు జమ చేసింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడించారు. మిగతా..2లో

## కరీంనగర్ సింహగర్జన సభ

## ఏ25.. కేటీఆర్ ప్రత్యేక పోస్ట్



హైదరాబాద్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక సభ అయిన కరీంనగర్ సింహగర్జన సభకు 25 ఏళ్లు నిండాయి. ఈ మేరకు అప్పటి పేపర్ క్లిప్పింగ్‌లను ట్యాగ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 2001 మే 17న జరిగిన సింహగర్జన నుంచి ఇటీవలే పూర్తయిన రజతోత్సవ వేడుకల వరకు బీఆర్ఎస్ పార్టీ అదే జోష్‌లో ఉందని అన్నారు. కనుచూపు మేరల్లో అంతా అంధకారం, అన్నీ అపనమ్మకాలు, గత కాలపు గాయాలు.. ధనం బలం లేదు.. రాజకీయ బలగం లేదు. అయినా సింహగర్జన సభకి జనం పోటెత్తిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. తనను కన్నభూమి తెలంగాణ.. ఎందుకిలా గోస పడుతుందన్న ఆవేదన, మాతృభూమిపై గుండెల నిండా పొంగే తెలంగాణ ప్రేమ, రాష్ట్రాన్ని సాధించాలన్న నిండైన పట్టుదల, ప్రజలు అండగా ఉంటారన్న భరోసా.. ఈ నాలుగే ఉద్యమ నాయకుడు కేసీఆర్‌ను నడిపించిన నాలుగు రథ చక్రాలని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## భారత్‌కు డబుల్ షాక్.. రష్యా చమురుపై అమెరికా ఆంక్షలతో కొత్త చిక్కులు



- రష్యా చమురుపై అమెరికా ఆంక్షల మినహాయింపునకు ముగింపు
- ఇరాన్ యుద్ధంతో ఇప్పటికే అస్థిరంగా చమురు సరఫరా
- భారత్‌పై ఒకేసారి రెండు వైపుల నుంచి ఇంధన ఒత్తిడి

## సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 38కి పెంపు..

## ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్రపతి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచిన కేంద్ర ప్రభుత్వం
- ఈ మేరకు జారీ చేసిన ఆర్డినెన్స్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం
- పెండింగ్‌లో ఉన్న 92,000 కేసులను తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం
- 1956 నాటి న్యాయమూర్తుల సంఖ్య చట్టానికి సవరణ

ఢిల్లీ: దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జడ్జీల సంఖ్యను 34 నుంచి 38కి పెంచుతూ ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఆర్డినెన్స్‌పై ఆమోదముద్ర వేయడంతో ఇది తక్షణమే అమల్లోకి వచ్చింది. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని మిగతా..2లో






## మూడు రాష్ట్రాల్లో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు

- తెలంగాణలో 93 కిమీ.. కోకాపేట, వికారాబాద్‌లలో రైల్వేస్టేషన్లు
- మహారాష్ట్ర పరిధిలో 3 ప్రాంతాల్లో 35 కిమీ మేర భూగర్భ మార్గం
- స్టేషన్లు 12.. వేగం 300 కిమీ.. దూరం 671 కిమీ

హైదరాబాద్: హైదరాబాద్ నుంచి దేశ ఆర్థిక రాజధాని ముంబయి నగరానికి ప్రస్తుతం రోడ్డు మార్గంలో అయితే సుమారు 12 గంటలు..

## ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలి

కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకుందాం

- సహకారమే మన బలం
- భారత ప్రధాని మోదీ, స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ నిర్ణయం
- బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయం



గోథెన్‌బర్గ్: సహకారమే మన బలమని భారత ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మోదీ స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్సన్‌తో సమావేశమ్యారు. ఇరుదేశాల మధ్య మిగతా..2లో

## ఇరాన్‌లో శ్రీమహావిష్ణువు ఆలయం...

## ఎక్కడుందో చెప్పిన అమితాబ్ బచ్చన్




- ఇరాన్‌లోని విష్ణు ఆలయం వీడియోను షేర్ చేసిన అమితాబ్ బచ్చన్
- 135 ఏళ్ల ఆలయాన్ని పొరపాటున పురాతన ఆలయంగా పేర్కొన్న బిగ్ బీ
- 1892లో భారత వ్యాపారుల కోసం ఈ ఆలయం నిర్మాణం

## 'సర్'పై రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ఉద్యోగుల మీద

# నమ్మకం లేదేమో!



- కేంద్రమే డబ్బులు ఇస్తుంటే ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందేంటి?
- అనర్హుల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు
- బండి భగీరథ్ కేసులో కేంద్ర ప్రమేయం ఉండదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరికి కనీస మద్దతు ధర పెంచినా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని మిగతా..2లో

# సిగరెట్లపై పెంచిన పన్నులను పునఃసమీక్షించాలి

## రొయ్యల మేత ధరల పెరుగుదలపై జోక్యం చేసుకోవాలి

- ఆక్వా, పొగాకు రైతుల కోసం... కేంద్రానికి చంద్రబాబు లేఖలు
- ఆక్వా, పొగాకు రైతుల సమస్యలపై కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖలు
- మేత ధరల నియంత్రణకు నెలవారీ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- రైతుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి వేర్వేరుగా లేఖలు రాశారు. రొయ్యల మేత ధరల పెరుగుదల, మిగతా..2లో

## బీసీ జనాభాలో తొలి మూడు స్థానాల్లో శ్రీకాకుళం, కర్నూలు, విశాఖ




- రాష్ట్ర జనాభాలో సగం బీసీలే
- 2024- కులగణన నివేదికలో వెల్లడి
- 2.68 కోట్ల మందితో వెనుకబడిన వర్గాల వాటా 50.59%
- ఉత్తరాంధ్రలో బడుగులే సింహభాగం

## ఇరాన్‌తో శాంతి చర్చలకు అమెరికా 5 కండిషన్లు

శాంతి చర్చల్లో ఇరాన్‌కు కఠిన షరతులు పెట్టిన అమెరికా




- 400 కేజీల యురేనియం అప్పగించాలని డిమాండ్
- ఆంక్షలు ఎత్తివేస్తేనే చర్చలంటూ ఇరాన్ ఎదురు ప్రతిపాదన
- అమెరికా ద్వంద్వ వైఖరిపై ఇరాన్ విదేశాంగ శాఖ తీవ్ర విమర్శలు

# ఇరాన్‌తో శాంతి చర్చలకు అమెరికా 5 కండిషన్లు

ఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. చర్చలు ముందుకు సాగాలంటే ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠినమైన షరతులు ఉంచినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ షరతులు ఇరాన్‌కు ఆమోదయోగ్యంగా లేకపోవడంతో చర్చల ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇరాన్‌కు చెందిన 'ఫార్స్ న్యూస్' ఏజెన్సీ కథనం ప్రకారం గతంలో విధించిన ఆంక్షల వల్ల జరిగిన నష్టానికి ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తే లేదని అమెరికా స్పష్టం చేసింది. చర్చల్లో భాగంగా 400 కిలోల శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా, ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో ఒక్కదానికి మాత్రమే పనిచేసే అనుమతి ఉంటుందని మరో షరతు పెట్టింది. విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్లో 25 శాతం కూడా విడుదల చేసేందుకు నిరాకరించినట్లు సమాచారం. ఈ షరతులన్నింటికీ ఇరాన్ అంగీకరించినా, అమెరికా-ఇజ్రాయెల్ దాడుల ముప్పు మాత్రం తొలగిపోదని కూడా ఈ నివేదిక పేర్కొంది. అమెరికా తీరుపై ఇరాన్ కూడా తీవ్రంగా స్పందించింది. శాంతి చర్చలు జరగాలంటే తమకు కూడా ఐదు 'విశ్వాసం కలిగించే' షరతులు ఉన్నాయని తేల్చి చెప్పింది. అన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలకు ముగింపు పలకాలని, తమపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని, స్తంభింపజేసిన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. యుద్ధ నష్టాలకు పరిహారం చెల్లించడంతో పాటు, కీలకమైన చమురు రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమత్వాన్ని గుర్తించాలని కోరింది. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బకాయి తీవ్రంగా స్పందించారు. శాంతి, స్థిరత్వం పేరుతో అమెరికా, ఇజ్రాయెల్ నాటకాలాడుతున్నాయని, వారే సంక్షోభాన్ని సృష్టించి శాంతి పరిరక్షకులుగా నటిస్తున్నారని ఆయన ఆరోపించారు. "విధ్వంసం సృష్టించి, దాన్నే శాంతి అని పిలవడం వారి పాత ఎత్తుగడ" అని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. మరోవైపు, అమెరికా మళ్లీ సైనిక దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సైనిక అధికార ప్రతినిధి హెచ్చరించారు.

### భారత్‌కు డబుల్ షాక్.. రష్యా చమురుపై

# అమెరికా ఆంక్షలతో కొత్త చిక్కులు

ఢిల్లీ: గత కొన్నాళ్లుగా ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం నుంచి అతి తక్కువ నష్టంతో బయటపడుతూ వచ్చిన భారత్‌కు ఇప్పుడు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రష్యా నుంచి చమురు దిగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలకు ఇచ్చిన మినహాయింపు గడువు ఆదివారంతో ముగిసింది. ఈ నిర్ణయంతో భారత్ ఇంధన సమీకరణాలు పూర్తిగా మారిపోయే ప్రమాదం ఏర్పడింది. ఒకవైపు ఇరాన్ యుద్ధం కారణంగా హార్మూజ్ జలసంధిలో చమురు రవాణా అస్థిరంగా మారగా, ఇప్పుడు రష్యా చమురుపై ఆంక్షల ముప్పు భారత్‌ను రెండు వైపుల నుంచి ఒత్తిడిలోకి నెట్టింది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించడంతో భారత్ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. తక్కువ ధరకే లభిస్తున్న రష్యా చమురును భారీగా దిగుమతి చేసుకుని ద్రవ్యోల్బణం నుంచి రక్షణ కవచంగా వాడుకుంది. మే నెలలో రికార్డు స్థాయిలో రోజుకు 2.3 మిలియన్ బ్యారెళ్ల రష్యా చమురును భారత్ దిగుమతి చేసుకుంది. కొన్ని సందర్భాల్లో ఇది మన మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి చేరింది. అయితే, తాజాగా అమెరికా తీసుకున్న నిర్ణయంతో భారత రిఫైనరీలకు ఆంక్షల భయం పట్టుకుంది.

తప్పని ధరల పెంపు?

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 105 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది. ఇరాన్ యుద్ధం కారణంగా మధ్యప్రాచ్యం నుంచి చమురు సరఫరా ఎప్పుడు నిలిచిపోతుందో తెలియని పరిస్థితి. ఇప్పుడు చౌకగా లభించే రష్యా చమురుకు కూడా ఆంక్షల ముప్పు ఏర్పడటంతో భారత్‌కు గడ్డుకాలం తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. తన అవసరాల్లో 85 శాతానికి పైగా చమురును దిగుమతి చేసుకునే భారత్‌పై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను ఇటీవల లీటర్‌కు రూ.3 చొప్పున పెంచారు. తాజా పరిణామాలతో మళ్లీ ధరలు పెంచడం అనివార్యమని తెలుస్తోంది. పెట్రోస్ స్టోన్ ఎల్ఎల్‌పీ డైరెక్టర్ రిషభ్ జైన్ మాట్లాడుతూ "ఇంధన ధరల పెంపుతో దేశీయ లాజిస్టిక్స్, అంతర్జాతీయ రవాణా ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. చాలా కంపెనీలు ఉత్పత్తిని తగ్గించి, తమ వద్ద ఉన్న నిల్వలతోనే ఆర్డర్లను పూర్తి చేస్తున్నాయి" అని వివరించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. పన్నులు తగ్గించడం, సబ్సిడీలు ఇవ్వడం వంటి చర్యలు ఖజానాపై భారం మోపుతాయి. మరోవైపు, ధరలు పెంచితే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంది. ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే, గతంలో మాదిరిగా ఇంధనాన్ని ఆదా చేసేందుకు వర్క్ ఫ్రమ్ హోమ్, కార్యాలయ వేళల్లో మార్పులు వంటి చర్యలను ప్రభుత్వం మళ్లీ పరిశీలించే అవకాశం లేకపోలేదు.

# ఇరాన్‌లో శ్రీమహావిష్ణువు ఆలయం... ఎక్కడుందో చెప్పిన అమితాబ్ బచ్చన్

ఢిల్లీ: బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ తన సోషల్ మీడియా ఫాలోయర్స్‌కు చరిత్ర పాఠాలు చెప్పే ప్రయత్నం చేశారు. ఆదివారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇరాన్‌లోని బందర్ అబ్బాస్‌లో ఉన్న ఒక హిందూ విష్ణు ఆలయం వీడియోను పంచుకున్నారు. 'ఏ విష్ణు జాన్' అనే పర్షియన్ గీతాన్ని జతచేసి ఈ వీడియోను పోస్ట్ చేశారు. అయితే, సుమారు 135 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయాన్ని ఆయన పొరపాటున "పురాతన ఆలయం" అని పేర్కొనడం చర్చనీయాంశమైంది. "ఇరాన్‌లోని బందర్ అబ్బాస్‌లో ఉన్న పురాతన హిందూ విష్ణు ఆలయం.. 1892లో ఖజార్ శకంలో నిర్మించబడింది. నగరంలో పనిచేస్తున్న భారతీయ హిందూ వ్యాపారుల కోసం దీనిని నిర్మించారు" అని అమితాబ్ తన క్యాప్షన్‌లో రాసుకొచ్చారు. ఆయన చెప్పినట్లుగా ఇది 1892లో నిర్మితమైనప్పటికీ, దానిని పురాతన ఆలయంగా అభివర్ణించడంపై నెటిజన్లు స్పందిస్తున్నారు. భారత్, ఇరాన్ మధ్య వేల సంవత్సరాల నాటి సాంస్కృతిక, చారిత్రక బంధం ఉంది. 1947లో దేశ విభజనకు ముందు భారత్, ఇరాన్‌కు సరిహద్దు ఉండేది. శతాబ్దాలుగా ఈ రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కొనసాగాయి. మొఘలుల కాలంలో పర్షియన్ భాష మన పరిపాలన, సాహిత్యం, వాస్తుశిల్పంపై తీవ్ర ప్రభావం చూపింది. స్వాతంత్ర్యం తర్వాత 1950లో ఇరు దేశాలు అధికారికంగా దౌత్య సంబంధాలను నెలకొల్పుకున్నాయి. ఇటీవలి కాలంలో చబహార్ పోర్ట్ వంటి ప్రాజెక్టులతో ఈ బంధం మరింత బలపడింది. అమితాబ్ పోస్ట్ నేపథ్యంలో ఈ చారిత్రక సంబంధాలపై మరోసారి చర్చ మొదలైంది.

### బీసీ జనాభాలో తొలి మూడు స్థానాల్లో

# శ్రీకాకుళం, కర్నూలు, విశాఖ



అమరావతి: రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతుల వారే సగానికిపైగా ఉన్నారు. రాష్ట్ర మొత్తం జనాభా 5.31 కోట్లు కాగా, అందులో 2.68 కోట్ల మందితో బీసీల వాటా 50.59 శాతంగా ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో 2024 ఎన్నికల ముందు (ఫిబ్రవరిలో) అప్పటి సచివాలయ సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కులగణన ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి. నియోజకవర్గాల వారీగానూ బీసీల్లో ఏ కులం వారు ఎంత జనాభా ఉన్నారో వివరాలు సేకరించిన అప్పటి ప్రభుత్వం.. ఆ నివేదికను బహిర్గతం చేయకుండా తొక్కిపెట్టింది. సామాజికవర్గాల వారీగా వైకాపాకు అనుకూలంగా శాసనసభ స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక కోసమే అప్పట్లో సీఎం జగన్ ఈ నివేదికను బయటపెట్టలేదని విమర్శలొచ్చాయి. తాజాగా ఈ నివేదిక వెలుగులోకి వచ్చింది. ఇటీవల కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బందితో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దాదాపు పూర్తైంది. అందులోనూ బీసీ జనాభా దాదాపు ఇంతే శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

బీసీల్లో 138 కులాలు

రాష్ట్రంలో బీసీలను 5 కేటగిరీలుగా విభజించారు. ఇందులో మొత్తం 138 కులాలున్నాయి. బీసీ-ఏ కింద 51, బీసీ-బీ కింద 27, బీసీ-సీ కింద ఒకటి, బీసీ-డీ కింద 45, బీసీ-ఇ కింద 14 కులాలున్నాయి.

శ్రీకాకుళం జిల్లా జనాభాలో 80.83% బీసీలే..

ఆయా జిల్లాల్లో మొత్తం జనాభాలో బీసీల శాతం పరంగా శ్రీకాకుళం తొలి స్థానంలో ఉంది. ఈ జిల్లా జనాభాలో 80.83% (19.29 లక్షలు) మంది వెనుకబడిన వర్గాలే. 76.55 శాతంతో (15.14 లక్షలు) రెండో స్థానంలో విజయనగరం, 72.73 శాతంతో (12.74 లక్షలు) మూడో స్థానంలో అనకాపల్లి జిల్లాలు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో కర్నూలు (69.18%), విశాఖ (67.07%), అనంతపురం (60.25%) జిల్లాలున్నాయి. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే బీసీ జనాభా అత్యధికంగా ఉత్తరాంధ్రలోనే ఉంది. కనిష్ఠంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో బీసీల జనాభా కేవలం 3.26 శాతమే ఉంది. పోలవరం (15.16%), తూర్పు గోదావరి (29.43%), ప్రకాశం (33.91%), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ (38.73%) జిల్లాల్లోనూ బీసీ జనాభా తక్కువే ఉంది.

84.72 లక్షల మంది బీసీ-ఏలు..

బీసీల్లో ఉపవర్గాల వారీగా పరిశీలించగా.. అత్యధికంగా బీసీ-ఏలు 84.72 లక్షల మంది ఉన్నారు. తర్వాత బీసీ-డీ (82.88 లక్షలు), బీసీ-బీ (67.42 లక్షలు), బీసీ-ఈ (32.12 లక్షలు), బీసీ-సీ (1.7 లక్షలు) వర్గాల వారున్నారు.

బీసీ-ఏ సామాజిక వర్గాలకు చెందినవారు ఎక్కువగా శ్రీకాకుళం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఉన్నారు. బీసీ-బీ జనాభా కర్నూలు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉంది. బీసీ-సీ వర్గాలు పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు. నీ బీసీ-డీ జనాభా విజయనగరం, అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల్లో అత్యధికంగా ఉంది. నీ బీసీ-ఈ వర్గాలు కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ఎక్కువగా ఉన్నారు.

సంఖ్యాపరంగానూ అగ్రస్థానం శ్రీకాకుళానిదే

బీసీల జనసంఖ్య పరంగా చూసినా అగ్రస్థానం శ్రీకాకుళం జిల్లాదే. ఇక్కడ అత్యధికంగా 19.29 లక్షల మంది వెనుకబడిన తరగతుల వారున్నారు. తర్వాతి స్థానాల్లో కర్నూలు (18.85 లక్షలు), విశాఖ (15.48 లక్షలు), అనంతపురం (15.25 లక్షలు), విజయనగరం (15.14 లక్షలు), అనకాపల్లి (12.74 లక్షలు), శ్రీసత్యసాయి (12.02 లక్షలు) జిల్లాలు ఉన్నాయి. కాకినాడ, నెల్లూరు, నంద్యాల జిల్లాల్లో సుమారు 10 లక్షల చొప్పున ఉన్నారు. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 22,878 మంది ఉండగా, పోలవరం (60,038 మంది), బాపట్ల (5.08 లక్షలు), పార్వతీపురం మన్యం (5.14 లక్షలు), మార్కాపురం (5.16 లక్షలు) జిల్లాల్లోనూ బీసీ జనసంఖ్య తక్కువగా ఉంది.

# సిగరెట్లపై పెంచిన పన్నులను పునఃసమీక్షించాలి

మొదటి పేజి తరువాయి

పొగాకుపై అధిక పన్నుల భారం వంటి కీలక అంశాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆక్వా రైతులకు ఊరట కల్పించండి..

రాష్ట్రంలో రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరగడంపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. 2026 జనవరి నుంచి మే మధ్య కాలంలో సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకుల ధరలు 20 శాతానికి పైగా పెరిగాయని, దీంతో మేత తయారీ ఖర్చు కిలోకు రూ.31కి పైగా పెరిగిందని లేఖలో ప్రస్తావించారు. ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు రైతులకు ప్రయోజనం బదిలీ చేయని కంపెనీలు, ఇప్పుడు భారాన్ని మోపడం సరికాదని రైతులు వాదిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫిష్ మీల్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని, సోయా దిగుమతులపై ఆంక్షలు సడలించాలని కేంద్రాన్ని కోరారు. మరోవైపు, పౌల్ట్రీ తరహాలో ముడిసరుకుల ధరల ఆధారంగా మేత ధరలను ప్రతి నెలా సమీక్షించే విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

పొగాకు రైతులను ఆదుకోండి..

ఇదే సమయంలో, ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా సీఎం దృష్టి సారించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు వేర్వేరు లేఖలు రాశారు. సిగరెట్లపై జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీని భారీగా పెంచడం వల్ల కొనుగోళ్లు మందగించాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. గతేడాది వేలంలో కిలోకు రూ.280 ఉన్న ప్రారంభ ధర, ఈ ఏడాది రూ.250కి పడిపోయిందని తెలిపారు. ఈ పన్నుల విధానం వల్ల 43 వేల మంది రైతులు, లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పెంచిన పన్నులను పునఃసమీక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు కోరారు.

# ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఫోకస్

మొదటి పేజి తరువాయి

2025-26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది. ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలతో వ్యూహాత్మక మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ.4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది.

ధాన్యం సేకరణపై ప్రభుత్వం ఫోకస్

రైతులు సన్న మరియు దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది.

ధాన్యం తరలింపునకు 11,500 వాహనాలు

క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎం (ఐజవీ)లతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది.

# మూడు రాష్ట్రాల్లో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టు

మొదటి పేజి తరువాయి

రైల్లో అయితే దాదాపు 15 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైల్లో గంటకు గరిష్ఠంగా 300 కిమీ వేగంతో కేవలం మూడు గంటల్లో చేరుకునేలా హైదరాబాద్-పుణె-ముంబయి హైస్పీడ్ రైలు కారిడార్ ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే సర్వే పూర్తి కాగా, తాజాగా డీపీఆర్ కూడా సిద్ధం అయిందని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్) రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా తెలిపింది. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యాక బుల్లెట్ (హైస్పీడ్) రైల్లో హైదరాబాద్ నుంచి ముంబయికి కనిష్ఠంగా 2.55 గంటలు, గరిష్ఠంగా 3.13 గంటల్లో చేరుకోవచ్చని పేర్కొంది. ఈ ప్రాజెక్టులో మరో ఆసక్తికరమైన అంశం ఉంది. మహారాష్ట్ర పరిధిలోని మూడు ప్రాంతాల్లో మొత్తం 35.30 కిమీ మేర భూగర్భ మార్గం నిర్మిస్తారు. ఈ కారిడార్‌లోని ఖండాల ఘాట్ ప్రాంతంలో మొత్తం 13 చోట్ల కొండల్ని తొలిచి సొరంగాల నిర్మాణం చేపడతారు. మొత్తం దూరం 24 కిలోమీటర్లు. హైదరాబాద్‌లో మెట్రో రైలు కోసం పిల్లర్లపై నిర్మించిన ట్రాక్ మాదిరిగా హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం ఉంటుంది. కొండ ప్రాంతాలు, భూగర్భంలో, నదుల మీదుగా నిర్మాణానికి ప్రతిపాదించిన ఈ హైస్పీడ్ రైలు కారిడార్‌లో అనేక విశేషాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాల పరిధిలో 7 హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుల్ని ప్రకటించగా.. ఇందులో 3 హైదరాబాద్ నుంచి ఉన్నాయి. హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు సర్వే దశలో ఉండగా హైదరాబాద్-పుణె-ముంబయి ప్రాజెక్టు సర్వే పూర్తి కావడంతోపాటు డీపీఆర్‌ను సైతం ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ సిద్ధం చేసింది. ఈ కారిడార్ మొత్తం దూరం 671 కిమీ. ఇందులో 93 కిమీ (14 శాతం)తెలంగాణలో, 121 కిమీ (18 శాతం) కర్ణాటకలో, అత్యధికంగా 457 కిమీ (68 శాతం) మహారాష్ట్రలో ఉంటుంది.

**రైలు ఆగే స్టేషన్లు..**

**తెలంగాణలో: వికారాబాద్, హైదరాబాద్ (కోకాపేట)**

**కర్ణాటకలో: కలబురిగి**

**మహారాష్ట్రలో: విక్రోలి, థానే, నవీ ముంబయి, లోనావాలా, పింప్రిచించ్వాడ్, పుణె, బారామతి, పంఢర్‌పుర్, సోలాపుర్**

**ఒక్కో స్టేషన్‌కు 247 ఎకరాలు...**

బుల్లెట్ రైళ్ల పరుగులో వేగమే కాదు..అవి ఆగే స్టేషన్లలోనూ ప్రత్యేకత ఉండనుంది. సాధారణ స్టేషన్ల మాదిరి కాకుండా అంతర్జాతీయ ప్రమాణాల్లో ఈ రైల్వేస్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. ఒక్కో స్టేషన్ ప్రాంగణానికి భవన నిర్మాణం, పార్కింగ్ ఇతర సదుపాయాల కోసం 247 ఎకరాల భూమి అవసరం అవుతుందని అంచనా వేశారు. పెద్దఎత్తున భూమి కావాలని ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇటీవల తొలుత రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాజాగా సీఎస్ రామకృష్ణారావు, స్పెషల్ సీఎస్ (రవాణా, ఆర్అండ్‌బీ) వికాస్‌రాజ్‌తో ఆ సంస్థ అధికారులు సమావేశమైన సందర్భంలో ఈ ప్రాజెక్టు విశేషాలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం గురించి వివరించారు. రాష్ట్రంలో తొలుత కోకాపేట, వికారాబాద్‌లలో హైస్పీడ్ స్టేషన్లను గుర్తించగా..తాజాగా శంషాబాద్ చేరింది. స్టేషన్ నిర్మించే ప్రాంతాన్ని గుర్తించాల్సి ఉంది. మొత్తంగా ఎయిర్‌పోర్ట్ సమీపంలోనే ఉంటుంది. వికారాబాద్, కోకాపేట స్టేషన్ల నిర్మాణాలు, ప్రాంగణాలకు మొత్తం 247 ఎకరాలు కావాలని ఎన్‌హెచ్ఎస్ఆర్‌సీఎల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. డిపో కోసం భారీగా భూమి కావాలని అడిగింది.

**నదులపై భారీ వంతెనలు..**

ఈ ప్రాజెక్టు మార్గంలో మొత్తం 101 వంతెనలను నిర్మించనున్నారు. ఇందులో 13 స్టీల్ వంతెనలు ఉంటాయి. ప్రధాన నదులపై 29 భారీ వంతెనలు ప్రతిపాదించారు. ములా-ముఠా నదిపై 360 మీటర్ల పొడవైన వంతెన..భీమా నదిపై 280 మీటర్ల వంతెన, బోరి నదిపై 225 మీటర్ల వంతెన నిర్మిస్తారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్యపైన అంచనాలు రూపొందించారు. ప్రారంభ సంవత్సరంలో రోజుకు 63,494 మంది..2041 నాటికి 95,050.. 2051కి 1,22,727.. 2061 నాటికి 1,52,092 మంది ప్రయాణిస్తారని అంచనా. వికారాబాద్ హైస్పీడ్ రైలు స్టేషన్‌కు 2.3 కిమీ దూరంలో రైల్వే స్టేషన్, 3 కిమీ దూరంలో వికారాబాద్ పట్టణం ఉన్నాయి. ప్రతిపాదిత స్టేషన్ ప్రాంతం భూమి ప్రైవేటుది. కోకాపేట హైస్పీడ్ రైలు స్టేషన్‌కు ప్రతిపాదిత మెట్రో రైలు స్టేషన్ (కోకాపేట నియోపోలిస్) 0.5 కిమీ దూరంలో, ఔటర్ రింగ్‌రోడ్ కేవలం 0.01 కిమీ దూరంలో, లింగంపల్లి రైల్వేస్టేషన్ 13 కిమీ దూరంలో ఉన్నాయి. ప్రతిపాదిత స్టేషన్ ప్రాంతం భూమి కొంత ప్రైవేటుది, కొంత ప్రభుత్వానిది.

**ఒక్కో రైల్లో 16 బోగీలు, 1,215 మంది ప్రయాణికులు**

ఒక్కో బుల్లెట్ రైల్లో 16 బోగీలు ఉంటాయి. ఒకేసారి మొత్తం 1,215 మంది ప్రయాణించే సామర్థ్యంతో సీట్లు ఉంటాయి. ప్రాజెక్టు ఆపరేషన్ కోసం మహారాష్ట్రలోని థానేలో ఒక భారీ బుల్లెట్ రైళ్ల డిపో, వర్క్‌షాప్‌ను..హైదరాబాద్‌లో మరో డిపోను ఏర్పాటు చేస్తారు. ముంబయిలో ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌ను ప్రతిపాదించారు

# ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలి

మొదటి పేజి తరువాయి

ఇరుదేశాల మధ్య సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా ఇరుదేశాలు అంగీకరించాయి. భారత్--ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం స్ఫూర్తితో తమ ప్రజల ప్రయోజనం కోసం కొత్త అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించారు. వ్యాపారం, వాణిజ్యం, టెక్నాలజీ, రక్షణ సహా కీలక రంగాల్లో పరస్పర సహకారంపై సంప్రదింపులు జరిపారు. సహకారమే మన బలమని ఉద్ఘాటించారు. రెండో రోజుల పర్యటన నిమిత్తం నెదర్లాండ్స్ నుంచి ఆదివారం ఉదయం స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌కు చేరుకున్న మోదీకి ఘనస్వాగతం లభించింది. మోదీ గౌరవార్థం ఆయన ప్రయాణించిన విమానానికి స్వీడన్ ఎయిర్‌ఫోర్స్ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. గోథెన్‌బర్గ్ ఎయిర్‌పోర్టులో మోదీకి స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ సాదర స్వాగతం పలికారు. మోదీకి స్వాగతం పలకడానికి స్వీడన్‌లోని ప్రవాస భారతీయులు తరలివచ్చారు. మోదీ రాకను పురస్కరించుకొని నిర్వహించిన సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం మోదీ, క్రిస్టర్సన్ మధ్య ప్రతినిధుల స్థాయి భేటీ జరిగింది. ఇరు పక్షాలు ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించారు.

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి అందుబాటులో ఉన్న నూతన మార్గాలపై చర్చించారు. హరిత పరివర్తన, కృత్రిమ మేధ(ఏఐ), వర్ధమాన సాంకేతికతలు, స్టార్టప్‌లు, సప్లై చైన్లు, రక్షణ, అంతరిక్షం, వాతావరణ చర్యలు సహా ప్రజల మధ్య సంబంధాల విషయంలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై భారత్, నెదర్లాండ్స్ ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

ప్రధాని మోదీకి 'పోలార్ స్టార్' గౌరవం

ప్రధాని మోదీ స్వీడన్ అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్'అందుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చేసిన కృషి, దూరదృష్టి కలిగిన నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందజేసినట్లు స్వీడన్ యువరాణి విక్టోరియా ప్రకటించారని విదేశాంగ శాఖ తెలిపింది.

భారత్, నెదర్లాండ్స్ మధ్య ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం

ద హేగ్: అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాయి. ఇకపై ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ నెదర్లాండ్స్‌లో పర్యటించారు. ఆ దేశ ప్రధానమంత్రి రోబ్ జెటెన్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాలు మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రక్షణ, అరుదైన ఖనిజాలు సహా కీలక రంగాల్లో పరస్పర సహకారం కోసం 17 ఒప్పందాలపై భారత్, నెదర్లాండ్స్ సంతకాలు చేశాయి. పశ్చిమాసియా పరిణామాలపై ఇద్దరు ప్రధానమంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయాల వల్ల ప్రపంచదేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. భేటీ తర్వాత వారిద్దరూ ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

### సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య 38కి పెంపు..

# ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్రపతి

మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 92 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, న్యాయమూర్తుల సంఖ్యను పెంచడం ద్వారా కేసుల విచారణను వేగవంతం చేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఈ ఆర్డినెన్స్ ద్వారా 'సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) చట్టం, 1956'లోని సెక్షన్ 2ను సవరించారు. దీని ప్రకారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కాకుండా ఇతర న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37కు పెరిగింది. దీంతో సీజేఐతో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 38కి చేరింది. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరగనందున, రాజ్యాంగంలోని ఆర్టికల్ 123 కింద కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి చట్టరూపం కల్పించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ తెలిపారు. ఈ తాజా నిర్ణయంతో ఏర్పడిన నాలుగు అదనపు న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం త్వరలో పేర్లను సిఫార్సు చేసే ప్రక్రియను ప్రారంభించనుంది.

### 'సర్'పై రేవంత్‌రెడ్డికి రాష్ట్ర ఉద్యోగుల మీద


# నమ్మకం లేదేమో!

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల వరికి కనీస మద్దతు ధర పెంచినా.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతుల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 'సర్'పై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. యుద్ధం వల్ల ఇంధనం ధరలు పెరిగితే అప్రజాస్వామికమని సీఎం ఆరోపించడం సరైంది కాదన్నారు. ఆదివారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వం రైతు డిక్లరేషన్ల పేరుతో హామీలు ఇచ్చి మోసం చేసింది. రాష్ట్రంలో కనీసం ధాన్యం కొనలేని పరిస్థితి నెలకొంది. రైతులు అనేక ప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్నారు. యూపీఏ హయాంలో ధాన్యం క్వింటాకు రూ.1,300 గిట్టుబాటు ధర ఉండేది. మోదీ ప్రభుత్వం దాన్ని రూ.2,360కు పెంచింది. ధాన్యం కొనుగోలుకు ప్రతి పైసా కేంద్రమే ఇస్తుంది. రాష్ట్రంపై రూపాయి కూడా భారం పడదు. మొత్తం కేంద్రమే భరిస్తున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లు ఎందుకు ఆలస్యం చేస్తుందో చెప్పాలి. రేవంత్‌రెడ్డి సర్కారు ధాన్యం మీద బోనస్ అని చెప్పి మాట తప్పింది. రాష్ట్ర మంత్రులంతా ఒక్కో జిల్లాకు వెళ్లి కొనుగోళ్లపై దృష్టి పెట్టి రైతుల ఇబ్బందులు తీర్చాలి.

అనర్హుల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు

ఇక స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) విషయానికొస్తే ఒక్కొక్కరికి రెండు లేదా మూడు చోట్ల ఓట్లు ఉంటే గుర్తించి తొలగిస్తారు. ముఖ్యంగా రోహింగ్యాల ఓట్లు కచ్చితంగా తొలగిస్తారు. 'సర్'పై రేవంత్‌రెడ్డి అనేక విమర్శలు చేస్తున్నారు. ఓట్ల ప్రక్షాళన మోదీ వచ్చి చేయరుగా.. రాష్ట్ర అధికారులే చేస్తారు. అయినా రేవంత్‌రెడ్డికి వారిపై విశ్వాసం లేదేమో. ఇటీవల ఒక సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ఓట్లు తొలగిస్తోందని సీఎం రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారు. 'సర్' విషయంలో కేంద్రం కుట్రలు చేయాలని చూస్తోందని ఒక భారాస నేత ఆరోపించారు. అదేంటో బయట పెట్టాలని నేను సవాల్ చేస్తున్నా. పెట్రోల్, డీజిల్‌పై అప్రజాస్వామికంగా ధరలు పెంచారని సీఎం రేవంత్ మాట్లాడుతున్నారు. కానీ ఇది కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్న అంశం కాదు. గతంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధర తక్కువ ఉన్నప్పుడు ఎక్సైజ్ డ్యూటీని కేంద్రం తగ్గించింది. రాష్ట్రాలను కూడా వ్యాట్ తగ్గించాలని కోరింది. మోదీ విజ్ఞప్తితో అనేక రాష్ట్రాలు తగ్గించాయి కూడా. దేశంలోనే అత్యధికంగా వ్యాట్ విధిస్తోంది తెలంగాణలోనే" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బండి భగీరథ్ కేసుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. ఈ కేసులో కేంద్రం ప్రమేయం ఉండదని అన్నారు. రాష్ట్ర పోలీసులకు సంబంధించిన విషయమని, వారే దర్యాప్తు చేసి ఏ విషయమైనా చర్యలు తీసుకునే అధికారం ఉంటుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

# తిరుమల కొండల్లో పచ్చదనం.. అటవీ సంరక్షణలో



తిరుపతి: తిరుమల పుణ్యక్షేత్రం అనగానే శ్రీవారి దివ్యమంగళ స్వరూపంతో పాటు పచ్చని గిరులు కళ్లముందుకొస్తాయి. ఆ పవిత్ర శేషాచల కొండలు ఇప్పుడు పచ్చదనంతో మరింత కళకళలాడుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అటవీ విభాగం దశాబ్దాలుగా చేస్తున్న కృషితో ఈ ప్రాంతంలో అటవీ విస్తీర్ణం ఏకంగా 89.40 శాతానికి చేరింది. ఇటీవల విడుదలైన ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక (ఐఎస్ఎఫ్ఆర్) ప్రకారం అటవీ సంరక్షణలో టీటీడీ దేశంలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచింది. టీటీడీ పరిధిలోని 2,719 హెక్టార్ల అటవీ ప్రాంతంలో దాదాపు 2,431 హెక్టార్లు పచ్చదనంతో నిండి ఉండటం విశేషం. 1980 నుంచి టీటీడీ అటవీ విభాగం శేషాచల అరణ్య సంపద పరిరక్షణకు, పర్యావరణ సమతుల్యతకు పెద్దపీట వేస్తోంది. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ పర్యవేక్షణలో తిరుమల, తిరుపతిలలో రెండేసి చొప్పున మొత్తం నాలుగు ఫారెస్ట్ రేంజ్‌ల ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు 24 గంటల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం గస్తీ కాస్తున్నాయి. అగ్నిప్రమాదాల నివారణకు ఏటా 26.5 లక్షల చదరపు మీటర్ల ఫైర్ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు, ప్రత్యేక బృందాలతో అప్రమత్తంగా ఉంటున్నారు. జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా టీటీడీ ఓ కీలక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పర్యావరణానికి హాని కలిగించే విదేశీ జాతి అకేషియా చెట్లను తొలగించి, వాటి స్థానంలో 576 హెక్టార్ల విస్తీర్ణంలో గంధం, ఎర్రచందనం, ఉసిరి, నేరేడు వంటి స్థానిక జాతి మొక్కలను నాటుతున్నారు. ఇప్పటికే 22 హెక్టార్లలో ఈ పనులు పూర్తయ్యాయి. దీనికి అవసరమైన మొక్కలను టీటీడీయే తన నర్సరీలలో పెంచుతోంది.

టీటీడీ కృషితో పచ్చని వనమైన శేషాచలం

మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణకు, జంతువుల సంరక్షణకు కూడా టీటీడీ ప్రాధాన్యత ఇస్తోంది. వేసవిలో జంతువుల దాహార్తి తీర్చేందుకు నీటి గుంతలు ఏర్పాటు చేయడం, భక్తుల భద్రత కోసం స్నేక్ రెస్క్యూ బృందాలను అందుబాటులో ఉంచడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఆలయ అవసరాలకు శ్రీగంధం, వంటచెరకు, దర్భ వంటివి సమకూర్చడంతో పాటు, తిరుమల-తిరుపతిలలో రహదారి డివైడర్లు, ఉద్యానవనాల సంరక్షణ బాధ్యతలను కూడా అటవీ విభాగమే చూసుకుంటోంది. ప్రస్తుతం పవిత్ర వనం, దివ్య ఔషధ వనం వంటి పలు ప్రాజెక్టులతో శేషాచల పచ్చదనాన్ని మరింత పెంచేందుకు టీటీడీ కృషి చేస్తోంది.

# వేంసూర్ పోలీస్ స్టేషన్ ఖమ్మం..



లోకల్ గైడ్' ఖమ్మంవేంసూర్ మండలం హనుమతండా చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ నిర్వహిస్తున్న వేంసూరు ఎస్సై కవితబక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు హనుమతండా లో ఏర్పాటు చేసిన




చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న వేంసూరు ఎస్సై కవిత....పశువుల అక్రమ రవాణాపై 24/7 నిఘా ఉంటుందన్నారు.పశువులను తరలించేటప్పుడు సరైన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండటం తప్పనిసరన్నారు.

# చింతకాని పోలీస్ స్టేషన్ ఖమ్మం...



లోకల్ గైడ్' చింతకాని ' ఖమ్మం జిల్లా'సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు: ఎస్సై చింతకానిరాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సరిహద్దుల్లో బాస్వపురం రోడ్డు చెక్ పోస్టులో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చింతకాని ఎస్సై వీరేందర్ తెలిపారు. ముఖ్యంగా అక్రమ పశు రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి తప్ప, ఏ పరిస్థితుల్లోనూ నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని స్పష్టం చేశారు.

# ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి.సీఐటీయూ.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 18. (లోకల్ గైడ్).ఆశ వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యం.డి సలీమ్ డిమాండ్ చేశారు.సోమవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్లగొండ మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాంప్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆశ వర్కర్లకు ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇస్తామని, ఇన్సూరెన్స్ సౌకర్యం 50 లక్షల రూపాయలు, మట్టి ఖర్చులకు 50,000 అర్హులైన ఆశ వర్కర్లకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్లు కల్పిస్తామని తదితర అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా నెలనెల సక్రమంగా వేతనాలు కూడా ఇవ్వకుండా ఆశ వర్కర్ల ను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయంగా రావలసిన హక్కుల కోసం పోరాడుతుంటే పోలీసుల ద్వారా నిర్బంధాలు ప్రయోగించి ఆశ వర్కర్ల ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో జాబ్ చాట్ లో లేని అనేక రకాల పనులు చేయిస్తూ అదనపు పని భారాలను మోపుతు ఆశ వర్కర్ల అనారోగ్యాలకు కారణం అవుతున్నారని విమర్శించారు. దశల వారి ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే కి వినతిపత్రం ఇస్తున్నామని, తమ సమస్యల పరిష్కారం కాకపోతే పోరాటం ఉదృతం చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలన కోరారు. సమస్యలు పరిష్కరించనీయుడల జులైలో నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్ జిల్లా కమిటీ సభ్యులు పోలే సత్యనారాయణ గంజి రాజేష్ నల్గొండ పట్టణ తిప్పర్తి కనగల్లు మండలాల ఆశా వర్కర్లు కే స్వర్ణ, డి నిర్మల, ఎడవల్లి ప్రేమలత, సిహెచ్ వీరభద్రమ్మ ,గాదరి పూలమ్మ, హేమలత,సిహెచ్ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం గౌరవ ఎమ్మెల్యే ఏపీ వివేకానంద గౌడ్ తో కలిసి వాటర్ బోర్డు ముట్టడి



కుత్బుల్లాపూర్ మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి)కుత్బుల్లాపూర్ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం గౌరవ ఎమ్మెల్యే ఏపీ వివేకానంద గౌడ్ తో కలిసి వాటర్ బోర్డును ముట్టడించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజల సమస్యపై తమ గళాన్ని వినిపించారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేస్తూ, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. కార్యక్రమంలోజాలిగం రాకేష్ ఉద్యమకారులు/బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుత్బుల్లాపూర్. పాల్గొని ప్రసంగించారు.

# నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉల్లాస్ కార్యక్రమంపై అవగాహన శిక్షణ.





నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . మే 18.( లోకల్ గైడ్).కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం లో భాగంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రాంతాలలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య




శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఆర్.పి లు , ఎస్.ఎల్.ఎఫ్ ఓబిలకు ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళలు, నిరక్షరాస్యులకు చదవడం, రాయడం మాత్రమే కాకుండా డిజిటల్ అక్షరాస్యతపై కూడా అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. స్మార్ట్ ఫోన్ల వినియోగం, ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపు, బ్యాంక్ ఖాతాల నిర్వహణ, పొదుపు అలవాట్లు, ఏటీఎం వినియోగం వంటి అంశాలలో అవగాహన పెంపొందించడం ద్వారా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మరింత బలపడతారని పేర్కొన్నారు. ప్రతి మహిళ చదువుకుంటే ప్రతి కుటుంబం, ప్రతి కాలనీ, ప్రతి పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని ఆమె అన్నారు.మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రజలకు చట్టపరమైన అవగాహన, పౌర హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, పట్టణ ఆరోగ్య కేంద్రాల సేవల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. డి.డి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, ఆర్థిక క్రమశిక్షణ ప్రతి కుటుంబానికి అత్యంత అవసరమని తెలిపారు. బ్యాంకు ఖాతాలు తెరవడం, పొదుపు అలవాట్లు పెంపొందించడం, ఏటీఎం వినియోగం, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండటం వంటి అంశాలపై సమగ్ర శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.డి.ఎం.సి శివాజీ మాట్లాడుతూ, ప్రతి మహిళ అక్షరాస్యురాలిగా మారడం ద్వారానే సమాజంలో సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్.పిలు , ఎస్.ఎల్.ఎఫ్ సభ్యులకు ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానం ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై విస్తృతంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిడి అనిల్ కుమార్, డి ఎం సి శివాజీ, టీఎంసీ శ్రీనివాస్, సి వోలు సిఎల్ఆర్పి లు ,ఆర్పీలు, ఎస్ ఎల్ ఎఫ్ ఓబీలు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏఐ, లైఫ్ స్కిల్స్ శిక్షణ



GOVERNAMENT OF TELANGANA
TG BC STUDY CIRCLE SIDDIPET
Muncipal Town Hall,Beside MEO Office,Nasarpura Siddipet-502103,
PH.No - 08457- 224941.Email. sdpt.tgbcstudycircle@gmail.com

పత్రికా ప్రకటన

సిద్దిపేట జిల్లా డిగ్రీ తీర్ణులైన నిరుద్యోగులకు తెలియజేయునది ఏమనగా బీసీ స్టడీ సర్కిల్ వారి ఆధ్వర్యంలో "AI &Life Skills Training programme"ను ఈనెల 27-05-2026 నుండి 30-05-2026 వరకు Work Shop/Training ఇవ్వబడును. ఆధునిక టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న దానికి అనుగుణంగా విద్యార్థులు, యువకులు కూడా వారి నిత్య జీవితాల్లో టెక్నాలజీ నేర్చుకొని భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగు పరుచుకోవాలని, MAGIC BUS INDIA FOUNDATION"సహకారంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుంది అని సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ పి కృష్ణ దయాసాగర్ గారు తెలియజేశారు. కావున సిద్దిపేట జిల్లాలోని నిరుద్యోగులు అందరు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్హతలు:
1.Aadhar card
2. Caste Certificate
3. Income Certificate
4. Study Certificates
5. 2 passport size photos

పైన తెలిపిన అన్ని సర్టిఫికెట్స్ (జిరాక్స్)తో ఈ నెల 26-05-2026 సాయంత్రం 5:00pm లోపు సిద్దిపేట స్టడీ సర్కిల్ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కొరకు 9490243095 ను సంప్రదించవచ్చు.

డాక్టర్. పి. కృష్ణ దయాసాగర్.
DIRECTOR
TGBCSD TRAINING CENTRE
SIDDIPET DISTRICT.

దీని ప్రతి జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి సిద్దిపేట గారికి సదరు పత్రికా ప్రకటనను అన్ని దినపత్రికలలో ప్రచురించుటకై కోరడమైనది.

సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మే 18: సిద్దిపేట జిల్లా నిరుద్యోగ డిగ్రీ పూర్తి చేసిన యువతకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్ శుభవార్త అందించింది. సిద్దిపేట బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 27-05-2026 నుండి 30-05-2026 వరకు ఏఐ, లైఫ్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్కిల్ దర్శకుడు డాక్టర్ పి. కృష్ణ దయాసాగర్ తెలిపారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో యువత కూడా టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకొని భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఉద్దేశంతో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సిద్దిపేట జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోల జిరాక్స్ ప్రతులతో ఈ నెల 26-05-2026 సాయంత్రం 5 గంటలలోపు సిద్దిపేట నసర్‌పురాలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని తెలిపారు.మరింత సమాచారం కోసం 9490243095 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

# ఫిట్ యాక్టివ్ తెలంగాణ మారథాన్ రన్‌లో 350 మంది క్రీడాకారుల పాల్గొనడం




సిద్దిపేట జిల్లా ప్రతినిధి(లోకల్ గైడ్)మే18:సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్దిపేట జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఫిట్ యాక్టివ్ తెలంగాణ మారథాన్ రన్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం డిగ్రీ కళాశాల మైదానం నుంచి పాత బస్టాండ్ వరకు నిర్వహించగా దాదాపు 350 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారులు,సహాయ కార్యదర్శులు,సీనియర్ క్రీడాకారులు,పీడీలు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.ఇందులో భాగంగా రేపు 19-05-2026న ఉదయం 11 గంటలకు సిద్దిపేట స్టేడియం మైదానంలో కెరీర్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా యువత మరియు క్రీడల అధికారి తెలిపారు.క్రీడలపై ఆసక్తి కలిగిన యువత,క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# 22న జిల్లా స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహణకు అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 18:సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ కే.హైమావతి జిల్లా స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్ష



నిర్వహించారు. ఈనెల 22వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పథకాలలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి సమావేశాలు పూర్తి చేసినట్లు పేర్కొన్న కలెక్టర్, జిల్లా స్థాయి సమావేశానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే సమావేశ ప్రాంగణంలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు బీమా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్న రకం వడ్లకు ప్రోత్సాహకం, ఆసరా పింఛన్లు తదితర పథకాల వివరాలను శాఖల వారీగా సిద్ధం చేసి ప్రజలకు వివరించాలని సూచించారు. లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడించేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో డీఆర్వో నాగరాజమ్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలి....

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



లోకల్ గైడ్ ' ఖమ్మంఅత్యవసర పరిస్థితుల్లో ముఖ్యమైన పత్రాలను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో భద్రపరచుకోవాలి వర్షాకాలం సీజన్‌కు ముందస్తు సన్నద్ధతలో భాగంగా విజయవంతంగా ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణమున్నేరు వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ఖమ్మం, వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను




ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు.వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిఎస్టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చన్నారు.అంతకుముందు మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగ వరదల కారణంగా మున్నేరు పరివాహక ప్రాంతం ముంపుకు గురవుతుందని సమాచారం అందుకున్న జిల్లా కంట్రోల్ రూమ్ సంబంధిత అధికారులను, రెస్క్యూ బృందాలను అప్రమత్తం చేసింది. స్థానికంగా ఉన్న ఆపద మిత్ర వాలంటీర్ల సహకారంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేర్చడం జరిగింది.రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రిలీఫ్ క్యాంప్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్, అక్కడ బాధితులకు అందించాల్సిన ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.వరదల సమయంలో ప్రజలు ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌లు, భూ పత్రాలు వంటి ముఖ్యమైన డాక్యుమెంట్లు, విలువైన వస్తువులను వాటర్ ప్రూఫ్ జిప్ బ్యాగ్‌లలో సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సమయంలో వెంట తీసుకుని వెళ్లేందుకు ప్రతి కుటుంబం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అన్నారు.ప్రజల్లో విపత్తుల నిర్వహణపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక అవగాహన వీడియోలు రూపొందించి వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఖమ్మం జనరల్ ఆస్పత్రి వద్ద వరదలలో ఎవరైనా చిక్కుకుంటే వారిని సంరక్షించి వైద్య సేవలు అందించేలా మాక్ ఎక్సర్సైజ్ చేపట్టామని అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఎదులాపురం మునిసిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్డీఆర్ఎఫ్ 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ బి. మరియాదాస్, ఎన్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్మెంట్ ఏఎంవిఐ, టీజీ ఎన్పిడిసిఎల్, వైద్య, ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, మునిసిపల్, రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు, రెస్క్యూ బృందాలు, ఆపద మిత్ర వాలంటీర్లు తదితరులు పాల్గొన్నార

## జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడతకు శ్రీకారం

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు, యూత్ ఐకాన్ ప్రీతం




శేరిలింగంపల్లి, మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మరో శుభవార్త అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఒకవైపు ప్రత్యేక తెలంగాణ స్వప్నం సాకారమైన వేళ, మరోవైపు పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా పేద, నిరుపేద కుటుంబాలకు గృహ వసతి కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో రెండో విడత మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని 2026 జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా వేలాది మంది పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుండగా, ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల రాఘవరావు, ప్రీతం మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున పేదల జీవితాలలో వెలుగులు నింపే ఈ నిర్ణయం చారిత్రాత్మక మని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు.

## భౌతిక శాస్త్రంలో ఐ.ఎస్.రవి వర్మకు పీహెచ్.డీ.

-సోడియం-అయాన్ బ్యాటరీల అభివృద్ధిపై గీతం పరిశోధకుడి కీలక అధ్యయనం



పఠాన్ చేరు, మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతిక శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి ఐ.ఎస్.రవి వర్మ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. "నానోకాంపోజిట్ పాలిమర్ బ్లెండ్ ఎలక్ట్రోలైట్లలో సోడియం అయాన్ ప్రసరణ యంత్రాంగం అధ్యయనం" అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు భౌతిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రమేష్ మార్గదర్శనం వహించారు. సోడియం-అయాన్ బ్యాటరీలు, పునరుత్పాదక శక్తి నిల్వ వ్యవస్థలు, సూపర్ కెపాసిటర్లు, ఫ్యూయల్ సెల్స్, ఫ్లెక్సిబుల్ ఎలక్ట్రానిక్స్ కోసం ఉపయోగపడే అధునాతన నానోకాంపోజిట్ పాలిమర్ ఎలక్ట్రోలైట్ ఫిల్మ్‌ల అభివృద్ధిపై ఈ పరిశోధన దృష్టి సారించింది. ఎన్ ఏపిఎఫ్6 లవణం, ఇథలీన్ కార్బోనేట్ ప్లాస్టిసైజర్, ఏఎల్2ఓ3 నానోఫిల్లర్‌లతో రూపొందించిన పాలిమర్ బ్లెండ్ వ్యవస్థ ద్వారా గది ఉష్ణోగ్రత వద్ద మెరుగైన అయానిక వాహకత సాధించినట్లు వెల్లడించారు. ఎఫ్ టిఐఆర్, డిఎస్ సి, ఎస్ ఈఎం, ఎక్స్ ఆర్ డి, ఎలక్ట్రోకెమికల్ ఇంపిడెన్స్ స్పెక్ట్రోస్కోపీ వంటి ఆధునిక పద్ధతులతో ఫిల్మ్‌ల లక్షణాలను విశ్లేషించారు. డాక్టర్ రవి వర్మకు పీహెచ్.డీ. అర్హత లభించడంపై గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వం తదితరులు అభినందనలు తెలిపారు.

## మసీద్‌బండ బీజేపీ కార్యాలయంలో ఘనంగా రవి కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

-బీజేపీ బలోపేతానికి రవి కుమార్ యాదవ్ సేవలు అమూల్యం..బోయిని అనూష మహేష్ యాదవ్




శేరిలింగంపల్లి, మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ బోయిని అనూష మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో మసీద్‌బండ బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల సంఘ నాయకులు, బీజేపీ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై రవి కుమార్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించగా, నాయకులు పూలమాలలు వేసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..రవి కుమార్ యాదవ్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న అంకితభావం కలిగిన నాయకుడని కొనియాడారు. యువతకు ఆదర్శంగా నిలుస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం బోయిని అనూష మహేష్ యాదవ్ మాట్లాడుతూ..బీజేపీ పార్టీ బలోపేతానికి రవి కుమార్ యాదవ్ సేవలు అమూల్యమని అన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాల సంఘ ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళా నాయకులు, యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పర్యాటక, చారిత్రక, పరిశోధన కేంద్రంగా ముడుమాల్ నిలువు రాళ్ళు

నిలువురాళ్ల ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిది.

జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.



నారాయణపేట మే 18:ముడుమల్ నిలువు రాళ్లకు యునెస్కో గుర్తింపు కోసం ప్రపంచ వారసత్వ తాత్కా లిక జాబితాలో చోటు దక్క డం తెలంగాణకు గర్వకారణ మని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. సోమవారం నారా యణపేట జిల్లా కృష్ణా మండ లం ముడుమల్ నిలువు రాళ్ల (మెన్హిర్స్) ను ఆమె సందర్శిం చారు. నిలువు రాళ్లు, సప్తర్షి మండలంతో ఖగోళ పరిజ్ఞా నాన్ని, కాలాలను, వాతావ రణ మార్పులను ఆనాడే తెలుసుకునేవారని, కాలాల ను గుర్తించడానికి ఆది మాన వులు నిలువురాళ్లను ఓ క్రమంలో ఏర్పాటు చేసినట్లు ఆర్కియాలజీ శాఖకు చెంది న అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఎలాంటి సాంకేతికత లేని 4 వేల సంవ త్సరాల క్రితమే రాళ్ల ద్వారా తెలుసుకోవడం అనేది ఆబ్బురపరిచేలా, అద్భు తంగా ఉందని ఈ సంద ర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు యువజన క్రీడా పర్యాటక వారోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహిం చాలని ఆమె సూచించారు. రాష్ట్ర పర్యాటక శాఖ కు సంబంధించిన వారోత్సవాల టూరిస్ట్ గైడ్ పోస్టర్ తో పాటు మూడ్ మల్ నిలువు రాళ్ళ విశిష్టత ను తెలిపే ప్రచార పత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీ ఆర్ వో రషీద్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వెంకటేశ్ శెట్టి, ముడుమాల్ సర్పంచి, పురావస్తు శాఖ అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఎట్టకేలకు దొంగ అరెస్ట్ 10 దొంగతనాలు చేసిన నిందితుడు

## భారీ మొత్తంలో నగదు బంగారు వెండి స్వాధీనం.




నారాయణపేట మే 18: మక్తల్ ,మరికల్ పోలీస్ స్టేష న్ల పరిధిలో వరుస దొంగత నాలకు పాల్పడుతున్న నేరస్తుడిని ఎట్టకేలకు మక్తల్ పోలీసులు అరెస్ట్ చేసి, భారీ మొత్తంలో నగదు, బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ నారాయణపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో మక్త ల్ ఎస్ఐ వై. భాగ్యలక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట క్రాస్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి అనుమానాస్పదంగా బైక్‌ను వదిలేసి పారిపోవడానికి ప్రయత్నించాడనీ తెలిపారు.ఎస్ఐ సిబ్బంది వెంటాడి అతడిని అదుపులోకి తీసు కుని విచారించగా అతని పేరు కర్రెం సూర్యనారాయణ ఏ తిమ్మప్ప ఏ తిప్పి ఏ సూర్య మక్తల్ అంబేద్కర్ కాలని వాసి అని తెలిపారు.మక్తల్ లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయ గా మంకీ క్యాప్, దొంగతనా లకు ఉపయోగించిన పని ముట్లు, చోరీ చేసిన ఆస్తికి సంబంధించిన వివరాలు లభించాయన్నారు.నిందితుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై డబ్బుల కోసం దొంగతనాలకు పాల్ప డుతున్నాడు. సోషల్ మీడి యా ప్రభావంతో గత ఏడాది కాలంగా మక్తల్ ప్రాంతంలోని షాపులు, వైన్ షాపులు, తాళం వేసిన ఇండ్లను పగటి సమయంలో రెక్కి నిర్వహిం చేవాడనీ రాత్రి సమయంలో మంకీ క్యాప్, గ్లౌజులు ధరించి గుర్తుపట్టకుండా ముసుగు వేసుకొని జాగ్రత్తలు తీసుకు నేవాడనీ తెలిపారు. ఎలక్ట్రిక్ కట్టర్, భారీ సుత్తి, కట్టింగ్ ప్లేయర్స్, స్క్రూడ్రైవర్లు వంటి పనిముట్లతో షట్టర్ల తాళాలు, తలుపులు పగు లగొట్టి నగదు, బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసేవాడన్నారు.గత సంవ త్సరం మే నెల నుంచి ఇప్ప టివరకు మొత్తం 10 దొంగత నాలకు పాల్పడ్డాడనీ తెలిపారు. వీటిలో 9 కేసులు మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధి లో కాగా, 1 కేసు మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైందన్నారు.నిదితుడు ఇప్పట్ వరకు 9,28,000 నగదు, 2 తులాలు బంగా రం,3 కిలోలు వెండి, 7,200విలువైన 2 బాటిళ్ల,సిగరెట్లుమొత్తం 12,12,000 దొంగలించాడని స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.నిందితుని ద్వారా 5,04,000 నగదు,13 గ్రాముల బంగారం,60 తులాలు వెండి,వి ఓ వి 50 మొబైల్ ఫోన్,రియల్ మీ 3 మొబైల్ ఫోన్ 35,000 విలువ చేసే సిగరెట్లు మొత్తం స్వాధీనం 9,19,500 స్వాదీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

### ప్రజలకు ఎస్పీ సూచనలు...

ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలకు బలమైన తాళాలు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా వ్యాపారులు తమ దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకో వాలని ఎస్పీ వినీత్ సూచిం చారు. ఎలాంటి అనుమానా స్పద వ్యక్తులు కనిపించినా లేదా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 100 కు సమాచారం అందించాలని కోరారు.ఈ కేసులను ఛేదించి, చోరీ సొత్తును స్వాధీనం చేసు కున్న పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలు , రివార్డులు అందజేయ నున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో డీఎస్పీ మహేష్, మక్తల్ సీఐ కె. రాంలాల్, ఎస్ఐ లు వై. భాగ్యలక్ష్మి రెడ్డి, పురుషోత్తం, విజయ్ భాస్కర్,సిసిఎస్ టాస్క్ ఫోర్స్ బృందాలు, మక్తల్ క్రైమ్ ఏ ఎస్సై శంకరయ్య పి సి లుఅశోక్,నరేష్ ,శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మజిలీస్ పార్టీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం : ధర్మాచార్య సంపర్క ప్రముక్ పగుడాకుల బాలస్వామి

గోవులను అక్రమంగా తరలిస్తున్నప్పటికీ చోద్యం చూస్తున్న పోలీసు యంత్రాంగం

పోలీసులను భయభ్రాం తులకు గురిచేస్తున్న ఎంఐఎం నేతలు పట్టించుకోని పాలకులు



నారాయణపేట మే 18: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా భాగ్యనగర్ లో గో హత్యలు విపరీతంగా పెరుగుతున్నాయని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కారణమని విశ్వహిం దూ పరిషత్ రాష్ట్ర ధర్మాచా ర్య సంపర్క ప్రముక్ పగడా కుల బాలస్వామి ఆరోపించా రు. ఓటు బ్యాంకు రాజకీయా లకు కక్కుర్తి పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎంఐఎం ఆదేశాలకు తలోగ్గిందని విమ ర్శించారు. ఎంఐఎం ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, కార్పొరేట ర్లు నడిరోడ్డుపై వచ్చి పోలీ సులపైనే దౌర్జన్యం చేస్తున్న ప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అత్యంత హేయమని ఆయన విమ ర్శించారు.ఈ మేరకు సోమ వారం బాలస్వామి ఓ ప్రకట న విడుదల చేశారు. స్వయం గా రైతు బిడ్డ అయిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, డిజిపి సి వి ఆనంద్ గోరక్షణలో ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యాధు నిక గోశాలలు నిర్మిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మరి గోవులను విపరీతంగా కోత కు తరలిస్తుంటే ఎందుకు స్పందించడం లేదని నిలదీ శారు.ముస్లిం అంటే కాంగ్రెస్ కాంగ్రెస్ అంటే ముస్లిం అనే మాటను నిలబెట్టుకోవడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతుడు అవుతున్నాడని ఎద్దేవా చేశా రు. ముస్లింల మెప్పుకోసం హిందువుల గొంతు కోస్తా రా..? అని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలు తాకట్టుపెట్టి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటు అన్నారు. గోరక్ష చట్టాలు అమలు చేయడం లో పోలిస్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని బాలస్వామి ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీ సులకే సవాల్ సవాల్ చేస్తూ భయభ్రాంతులను సృష్టిస్తు న్న ఎంఐఎం నేతలను కట్టడి చేయడంలో చేతులు ముడు చుకుంటున్నారని విమ ర్శించారు. బక్రీద్ దగ్గర పడు తున్న కొద్దీ వేలాది గోవులు భాగ్యనగర్ పాతబస్తీకి చేరు కున్నాయని, వాటిని కాపాడి గోశాలలకు తరలించాలని పోలీసులను డిమాండ్ చేశా రు. నడిరోడ్డుపై పోలీసులను ఎంఐఎం నేతలు భయపెడు తుంటే కూడా స్పందించక పోవడం దారుణం అన్నారు. పైగా గోరక్ష చట్టాలను కఠినం గా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న హిందూ సంస్థల నాయకులపై కేసులు పెట్టడం అత్యంత దారుణం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సంస్థల నాయకులను భయపెట్టి గోవుల హంతకులకు మద్దతి స్తున్న రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవడం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు పేరుకు మాత్ర మే ఉన్నాయని, ఎక్కడ కూడా ఆవులను పట్టుకోవ డం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం స్పందిం చి అక్కడక్కడ డంపు చేసిన గోవులను వెంబడే విడుదల చేసి గోషాలకు తరలించాలని బాలస్వామి డిమాండ్ చేశారు.

## ఎస్ ఐ ఆర్ పకడ్బందీగా జరిగేలా బి ఎల్ ఏ లు కృషి చేయాలి

సర్ జిల్లా ఇంఛార్జి రఘువీర్ యాదవ్



నారాయణపేట మే 18:ఎన్నికల కమిషన్ ఓట్ల ప్రక్షాళనకు నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ నారాయణపేట జిల్లాలో పకడ్బందీగా జరిగేలా బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ న్యాయవాది, సర్ జిల్లా ఇంఛార్జి రఘువీర్ యాదవ్ ఒక ప్రకటనలో కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి బి ఎల్ ఏ లు దగ్గరుండి అధికారులకు సహకరించాలని అన్నారు.ముఖ్యంగా దొంగ ఓట్లను తొలగించాలని,రోహిగ్యాల ఒక్క ఓటు ఉండకుండా చూడాలని,వలస వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారి ఓట్లను తొలగించాలని,చనిపోయిన వారి ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఓట్లను తొలగించాలని సూచించారు.అధికార కాంగ్రెస్,మైనార్టీ ఓట్లకు కక్కుర్తి పడే బి ఆర్ ఎస్ పార్టీలు పశ్చిమ బెంగాల్ నుంచి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో రోహిగ్యాలు జొరబడుతున్నారని అట్టి వారి ఓట్ల నమోదుకు ఆపార్టీలు పని చేస్తాయని హెచ్చరించారు.దీని పట్ల ప్రతి ఏజెంట్ అప్రమత్తంగా ఉండి దొంగ ఓట్లను నమోదు చేయకుండా అడ్డుకోవాలని కోరారు.

## సైబరాబాద్‌లో వీకెండ్ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

-300 మందిపై కేసులు నమోదు

-మద్యం మత్తులో డ్రైవింగ్ తీవ్రమైన నేరం



సైబరాబాద్, మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా నిర్వహించినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ అదనపు డీసీపీ ట్రాఫిక్-1 జి. హన్మంతరావు తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీలలో భాగంగా మొత్తం 300 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా, వారిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 253 మంది ద్విచక్ర వాహనదారులు, 09 మంది ఆటో డ్రైవర్లు, 38 మంది కార్ డ్రైవర్లు ఉన్నారు. హెవీ వాహనాలపై ఎలాంటి కేసులు నమోదు కాలేదు. రక్తంలో ఆల్కహాల్ మోతాదు (బిఎసి) ఆధారంగా కేసులను పరిశీలిస్తే, 232 మంది 36 మిల్లీగ్రాములు నుంచి 200 మిల్లీగ్రాముల మధ్య, 35 మంది 201 నుంచి 300 మిల్లీగ్రాముల మధ్య, మరో 33 మంది 301 నుంచి 550 మిల్లీగ్రాముల మధ్య మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. పట్టుబడిన వారందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు మరోసారి హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైతే భారతీయ న్యాయ సంహిత-2023లోని సెక్షన్ 105 ప్రకారం కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ నేరానికి గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉండగా, గత వారం మే 11 నుంచి మే 16 వరకు నమోదైన డ్రంక్ డ్రైవింగ్ కేసులలో మొత్తం 96 కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 07 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష, 02 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవా శిక్ష, మరో 87 మందికి జరిమానాలు విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

## 10వ ఓపెన్ నేషనల్ కుంగ్ ఫు ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న తుమ్మల పాండురంగారెడ్డి

-ఆత్మరక్షణకు కరాటే క్రీడలు ఎంతో ఉపయోగకరం..తుమ్మల పాండురంగారెడ్డి



పఠాన్ చేరు, మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): అమీన్పూర్ డివిజన్ పరిధిలోని బంధంకొమ్ము ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఆదివారం సాయంత్రం లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ ఓపెన్ నేషనల్ కుంగ్ ఫు ఛాంపియన్ షిప్ కార్యక్రమానికి అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణ కోసం కరాటే, కుంగ్ ఫు వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. యువతతో పాటు చిన్నారులు కూడా ఇటువంటి క్రీడలలో పాల్గొని శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ బిజిలి రాజు, కృష్ణ, కొల్లూరు చంద్రకళ గోపాల్, ఎడ్ల రమేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు చౌటకూరి మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## నేటి నుంచే 'పర్యాటక వారోత్సవాలు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'తో పర్యాటక రంగానికి సరికొత్త కళశ్రీ



రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక వారసత్వ సంపదను, పర్యాటక శోభను ప్రపంచానికి చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక వారోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక, పురావస్తు (హెరిటేజ్) శాఖలు, నిథమ్ సంస్థల సంయుక్త సమన్వయంతో ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.. కార్యకలాపాలు.తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం. ఎకో-టూరిజం ప్రదేశాలను ప్రమోట్ చేయడంతో పాటు, పర్యాటక రంగం ద్వారా యువతకు లభించే ఉపాధి అవకాశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు.వారోత్సవాల ప్రత్యేక ఆకర్షణలుహెరిటేజ్ వాక్లు: చారిత్రక కట్టడాల ప్రాశస్త్యాన్ని వివరించేలా ప్రత్యేక కార్యక్రమాలు.స్వచ్ఛత కార్యక్రమాలు: ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు డిజిటల్ ప్రచారం: సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లతో ప్రత్యేక కార్యక్రమాలు.పర్యాటక సొగసుల 'తెలంగాణ'రాష్ట్రంలో పర్యాటక రంగానికి తిరుగులేని ఆదరణ ఉందని, స్వదేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించే ఎన్నో అద్భుత ప్రాంతాలు ఇక్కడ ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది.మౌలిక వసతుల కల్పన, వారసత్వ సంపద పరిరక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పర్యాటక రంగాన్ని సమీకృతంగా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.మే 23న 'టూరిజం కాన్క్లేవ్ 2026'ఈ వారోత్సవాల ముగింపు సందర్భంగా మే 23న హైదరాబాద్లో "డెస్టినేషన్ తెలంగాణ: అనే ఇతివృత్తంతో ప్రతిష్టాత్మక 'పర్యాటక సదస్సు (టూరిజం కాసేవ్) - 2026' నిర్వహించనున్నారు.


## రైతుల వరి ధాన్యం రవాణా సమస్యలపై సమావేశం నిర్వహించిన ములుగు డీ ఎస్ పీ రవీందర్

ములుగు : లోకల్ గైడ్:ములుగు జిల్లాలో యాసంగి పంట సీజన్లో రైతులు పండించిన వరి ధాన్యం రవాణాకు లారీల కొరత ఏర్పడిన నేపథ్యంలో, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ములుగు డీఎస్పీ రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు, లారీ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రవాణా చేయడంతో పాటు, మిల్లుల్లో త్వరితగతిన అన్లోడ్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లారీ ఓనర్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మరియు పౌర సరఫరాల శాఖ అధికారులు సానుకూలంగా స్పందిస్తూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# చిన్నారి ప్రతిభకు క్రీడా పాఠశాలలో

సీటు పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించిన గిరిజన ఆదివాసి బిడ్డ




వాజేడు : లోకల్ గైడ్:ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామానికి చెందిన బోదెబోయిన కవిత, గురుదేవ్ దంపతుల కుమార్తె బోదెబోయిన హెన్నా దేవ్ చిన్న వయస్సులోనే అసాధారణ ప్రతిభ కనబర్చి క్రీడా పాఠశాలలో సీటు సాధించింది. ప్రస్తుతం ఆమె చీకుపల్లి ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతోంది. వైద్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఆమె తండ్రి గురుదేవ్ స్వయంగా క్రీడాకారుడు కావడంతో, కుమార్తెను క్రీడా పాఠశాలకు ఎంపిక చేయాలనే లక్ష్యంతో ఏడాది పాటు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన తొమ్మిది రకాల ఈవెంట్లలో హెన్నా దేవ్ అద్భుత ప్రతిభ కనబర్చింది. నాలుగు నిమిషాల్లో 800 మీటర్ల పరుగు పూర్తి చేయడం, బ్రాడ్ జంప్‌లో 150 సెంటీమీటర్లు, వర్టికల్ జంప్‌లో 28 సెంటీమీటర్లు, షటిల్ రన్‌లో 60 మీటర్లను 18 సెకన్లలో పూర్తి చేయడం వంటి ప్రతిభను ప్రదర్శించింది.అలాగే మెడిసిన్ బాల్ ఈవెంట్‌లో ఒక కిలో బరువున్న బంతిని 180 సెంటీమీటర్ల దూరం విసరగా, స్ప్రింట్ ఈవెంట్‌లో 30 మీటర్లను కేవలం ఐదు సెకన్లలో పూర్తి చేసింది. ఈ ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో 56వ ర్యాంకు సాధించి జనరల్ కేటగిరీలో హనుమకొండ క్రీడా పాఠశాలలో సీటు పొందింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన గిరిజన చిన్నారి ఈ స్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందిస్తున్నారు.

# రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఆదివాసి ముద్దుబిడ్డ ఎంపిక



ములుగు జిల్లా, కన్నాయిగూడెం : లోకల్ గైడ్ : రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు మండలానికి చెందిన ఆదివాసి బాలిక ఎంపిక కావడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది. ఇటీవల హకీంపేట క్రీడా పాఠశాలలో అడ్మిషన్ల కోసం నిర్వహించిన పోటీల్లో మండల పరిధిలోని రాజన్నపేట పంచాయతీ గంగగూడెం గ్రామానికి చెందిన పోడెం నందిత ప్రతిభ కనబర్చి ఓపెన్ కేటగిరిలో ఎంపికైంది. ప్రస్తుతం నందిత ఏటూరు నాగారం మండల పరిధిలోని ఆకులవారి ఘనపురం ఎంపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో మూడవ తరగతి చదువుతోంది. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలలో సీటు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆదివాసి బాలిక ఈ స్థాయిలో విజయం సాధించడం పట్ల గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేస్తున్నారు.

# మే 18 నుంచి 23 వరకు పర్యాటక వారోత్సవాలు... జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

పర్యాటక వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




ఖమ్మం, మే 18:లోకల్ గైడ్ :ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 18 నుండి మే 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న పర్యాటక వారోత్సవాలను జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్‌లోనీ తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పర్యాటక వారోత్సవాల పోస్టర్‌లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, మే 20న ఖమ్మం ఖిల్లాలో హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నట్లు, మే 21న జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై యూట్యూబ్ వీడియో ప్రెజెంటేషన్ చేసిన వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా టూరిజం సర్టిఫికెట్ ప్రధానం చేయబడు తుందని, మే 22న నేలకొండపల్లి బుద్ధ స్థూపం వద్ద స్వచ్ఛత/పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి సునీల్ రెడ్డి, తెలంగాణ టూరిజం అసిస్టెంట్ ఇంజనీర్ నరేష్, టూరిజం ఉద్యోగి చంద్రశేఖర్ ఆజాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, మే :లోకల్ గైడ్ :ప్రజా వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.వేంసూర్ మండలం మర్లపాడు గ్రామంలోని స్టేట్ పంచాయత్ రాజ్ చాంబెర్ ఫార్మర్ డైరెక్టర్ భీం రెడ్డి పుల్లా రెడ్డి గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఎం. అంజయ్య ఇంటి వరకు సిసి డ్రైయిన్ నిర్మించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పంచాయత్ రాజ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజెర్ల మండలం రాజ్యతండా కు చెందిన టి.సునీత, బి.కృష్ణ, సత్యనాగేంద్ర ముగ్గురు కలిపి గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 46/ఊ/2/1/2 లో కొంత భూమి ఉందని, వీటి మార్కెట్ విలువ అధికంగా ఉందని దీనినీ తగ్గించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా అదనపు కలెక్టర్ రెవెన్యూకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం నగరానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీమ్ టీ హబ్ డయాగ్నస్టిక్ సెంటర్ నందు ఔట్సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేస్తున్నప్పుడు టర్మినేషన్ పద్ధతిలో విధుల నుండి తొలగించారని తిరిగి తనకు ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఎంఅండ్ హెచ్ఓకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ లో ఘనంగా 2 కే రన్

నారాయణపేట మే 18:లోకల్ గైడ్ :యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా సోమవారం 2కే రన్ ను మక్తల్ నియోజక వర్గ కేంద్రంలో విజయవంతంగా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా యువజన క్రీడల శాఖ వారి ఆధ్వర్యంలో “ఫిట్ యాక్టివ్ తెలంగాణ” లో భాగంగా 2 కే రన్ నిర్వహించారు.ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ మానస, మున్సిపల్ కౌన్సిలర్స్ పావని, కోల వెంకటేష్, మక్తల్ పట్టణ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రవి కుమార్ పాల్గొన్నారు.ముగింపు కార్యక్రమమునకు ఆర్డీవో రాజేందర్ గౌడ్, డిపిఆర్ఓ రషీద్ , డివైస్ ఓ వెంకటేష్ తదితరులు పాల్గొని 2ని రన్ విజేతలకు జ్ఞాపికను అందజేశారు.

# కృష్ణ పీ హెచ్ సీ ని పరిశీలించిన కలెక్టర్

నారాయణపేట మే 18:లోకల్ గైడ్ :నారాయణ పేట జిల్లా కృష్ణా మండల కేంద్రంలో 15 వ ఆర్థిక సంఘం నిధులు రూ. కోటి 43 లక్షల తో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక పరిశీలించారు. కేంద్రంలోని వివిధ విభాగాల గదులను చూశారు. ఇంత వరకు కృష్ణా మండలానికి పీ హెచ్ సీ లేదా అని ప్రశ్నించగా కృష్ణా మండలం కొత్తగా ఏర్పడిందని, గతంలో మాగనూరు పీ హెచ్ సీ లోనే కృష్ణ మండలానికి చెందిన ప్రజలు సేవలు పొందేవారని, ఇప్పుడు కొత్తగా నిర్మించిన పీ హెచ్ సీ అందుబాటులోకి రానుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్ కలెక్టర్ కు తెలిపారు. నూతన పీ హెచ్ సీ లో ఇంకా ఏమైనా పనులు మిగిలి పోయాయా? అని కలెక్టర్ అడగడంతో .. పనులన్నీ పూర్తయ్యాయని డీ ఎం అండ్ హెచ్ ఓ తెలిపారు. అయితే జూన్ 2 న నూతన పీ హెచ్ సీ ప్రారంభోత్సవానికి జిల్లా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సమయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ తహాసిల్దార్ శ్రీనివాస్, డిపివో బిక్షపతి, కృష్ణా గ్రామ సర్పంచి నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రాజెక్ట్‌పై పాద యాత్రలు కాదు... సమా ధానాలు చెప్పాలి

టి ఆర్ ఎస్ డిమాండ్

నారాయణపేట మే 18:లోకల్ గైడ్ :పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి లక్ష్మారెడ్డి గార్లుపాదయాత్ర చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని మీరు ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని తెలంగాణ రక్షణ సమితి నేతలు కృష్ణ ముదిరాజ్. మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, గొంగళ్ళ రంజిత్, గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో ని టీఆర్ఎస్ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.మహబూబ్‌నగర్ జిల్లా అత్యధిక వలసలు వెళ్లిన జిల్లాగా పేరొందిందని, సాగునీరు అందిస్తే వలసలు తగ్గుతాయనే ఉద్దేశంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి 80 శాతం పనులు పూర్తి చేశామని మాజీ మంత్రులు చెబు తున్నారని, అయితే మిగిలిన 20 శాతం పనులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పనులు పూర్తయి ఉంటే ఇప్పటికే రైతులకు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని పేర్కొన్నారు.పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ నర్లాపూర్ నుంచి ఉదండాపూర్ వరకు పాదయాత్ర చేపడతామని ప్రకటించే ముందు, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయిందో చెప్పాలని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి కోసం ప్రజలు 13 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే,పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో అవినీతి, ప్యాకేజీల రాజకీయాలు చేసి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పారని వ్యాఖ్యానించారు.పాలమూరు ప్రాజెక్ట్ ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ, పనుల్లో నాణ్యత కంటే ప్యాకేజీలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. మట్టి తవ్వకాలు, తరలింపుల పేరుతో అవినీతి జరిగిందని ఆరోపించారు.ప్రాజెక్టును ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో పరిశీలించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అంశంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ, అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేసి ఉంటే రైతులకు ప్రయోజనం కలిగేదన్నారు. వట్టెం నుంచి డిండి వరకు నీళ్లు తరలించే ప్రణాళిక కూడా ఉందన్నారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను కప్పుపుచ్చుకునేందుకే ఇప్పుడు ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారుమాజీ మంత్రులకు ప్రాజెక్టులపై పూర్తి అవగాహన లేదని సంపద పోగు చేసుకునేందుకు అవగాహన మాత్రం అద్భుతంగా ఉందని ఎద్దేవ చేశారు, గత ప్రభుత్వాలను తప్పుబడుతున్న నాయకులు తామే అప్పట్లో మంత్రులుగా ఉన్న విషయాన్ని మరిచిపోతున్నారని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో కల్వకుంట్ల కవిత ఇచ్చిన అల్టిమేటం తర్వాతే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అకస్మాత్తుగా మేల్కొని పాదయాత్రలు ప్రకటించడం రాజకీయ నాటకంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో డాక్టర్ వెంకట రామమూర్తి ప్రభాకర్ దామోదర్ సురేష్ శ్యాం ప్రసాద్ మనోహర్గౌడ్ సౌమ్య రెడ్డి శ్రావణి ఎల్ల స్వామి శ్రీపతిరావు యువత అధ్యక్షుడు మనోజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం...

## జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్

ఖమ్మం, మే -18:లోకల్ గైడ్ :మైనారిటీ మహిళలకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనారిటీ మహిళలకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణ అందించనున్నట్లు, ఖమ్మం జిల్లాకు చెందిన ముస్లిం, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ మైనారిటీ మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల వ్యవధి గల ఈ కోర్సుకు ఇంటర్, అంతకంటే పై చదువులు పూర్తి చేసిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు అర్హులని పేర్కొన్నారు.దరఖాస్తుదారులు ఇన్‌కమ్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు (10వ తరగతి, ఇంటర్), రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాలని తెలిపారు.అర్హత , ఆసక్తి గల అభ్యర్థులు బల్లెపల్లి లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన ఉన్న విన్సోల్ ఎడ్యుకేషనల్ సొసైటీ లో గాని, జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని రెండవ అంతస్తు, గది నం. ా-29 లో గల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.ఇతర వివరాలకు 9704003002 నంబర్ లో సంప్రదించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఆదివాసీ పోరు కేక బహిరంగ సభను జయప్రదం చేయండి

చలో పాకాల కొత్తగూడ... చలో చలో కొత్తగూడ!



చర్ల : లోకల్ గైడ్ : జూన్ 3న మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడ మండల కేంద్రంలో ఆదివాసీల అస్తిత్వ పరిరక్షణ కోసం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) నాయకులు పిలుపునిచ్చారు. “మా భూమి మాకే.. మా ఉద్యోగాలు మాకే.. 50 ఏళ్ల దోపిడీపై తిరగబడదాం” అనే నినాదంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ, 1976 నుండి 2026 వరకు గత 50 సంవత్సరాలుగా లంబాడీలు అక్రమంగా ఎస్టీ జాబితాలో చేరి ఆదివాసీల రిజర్వేషన్లు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ అన్యాయంపై ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివాసీల హక్కులు, రిజర్వేషన్లు, చట్టాలు తమకే అమలు కావాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో షెడ్యూల్-5 నిబంధనలు పూర్తిగా అమలు చేయాలని కోరారు. జీవో 317, కొత్త జోనల్ విధానం పేరుతో ఏజెన్సీ జీవోలను పక్కనపెట్టి సాధారణ రిజర్వేషన్ విధానం అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అలాగే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ శాఖ వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. గోదావరి నది పరిసర ప్రాంతాల్లో భారీ ప్రాజెక్టుల ద్వారా మైదాన ప్రాంతాలకు నీరు అందుతున్నప్పటికీ ఆదివాసీ రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏలు ఆదివాసీల అభివృద్ధికి కాకుండా కేవలం జీతభత్యాల కేంద్రాలుగా మారిపోయాయని విమర్శించారు. అధిక వడ్డీలతో ఆదివాసీ రైతులను దోచుకుంటున్న అక్రమ వడ్డీ వ్యాపారులను కట్టడి చేయాలని కూడా డిమాండ్ చేశారు. సభ వివరాలు జూన్ 3, 2026, స్థలం : పాకాల కొత్తగూడ మండల కేంద్రం, మహబూబాబాద్ జిల్లాలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ)ఆధ్వర్యంలో. ఆదివాసీ యువత, మహిళలు, పెద్దలు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఇరప రాజుదొర పిలుపునిచ్చారు.

# విపత్తులను ఎదుర్కొనేం దుకు జిల్లా యేంత్రాంగం సర్వం సిద్ధం

జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.





నారాయణపేట మే 18: భవిష్యత్తులోసంభవించే ఎలాంటి విపత్తుల నైనా సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధతతో ఉందని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాం క తెలిపారు.జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆదేశాలు, రాష్ట్ర విపత్తు స్పందన దళం సూచనల మేరకు నారాయ ణపేట జిల్లా కృష్ణా మండలం నదీ పరివాహక ప్రాంతమైన వాసునగర్ లో సోమవారం జిల్లా యంత్రాంగం ఆధ్వ ర్యంలో మాక్‌డ్రిల్ నిర్వ హించారు. భారీ వరదలు సంభవించిన సందర్భంలో ప్రజలను ఎలా రక్షించాలి, అత్యవసర పరిస్థితుల్లో స్పందనా బృందాలు ఎలా పనిచేయాలనే అంశాలపై ఈ మాక్‌డ్రిల్ చేపట్టారు. మాక్ డ్రిల్‌లో భాగంగా వరదల కారణంగా వాసు నగర్ లో ముంపునకు గురై చిక్కుకున్న ప్రజలను ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సురక్షితంగా రక్షించే చర్యలను ప్రదర్శిం చారు. స్పందనా బృందాలు సమన్వయంతో పనిచేస్తూ బోటు, లైఫ్ జాకెట్ల సాయం తో ప్రజలను రక్షించి, ప్రథమ చికిత్స అందజేసి అంబులెన్సులో సురక్షిత ప్రాంతా లకు తరలించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు.ఈ మాక్‌డ్రిల్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాం క పరిశీలించి, సహాయక చర్యల నిర్వహణ తీరును దగ్గరుండి పర్యవేక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ విపత్తులు వచ్చి అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సమయంలో ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా ప్రజ ల్ని ఎలా కాపాడాలని అంశం పై మార్క్ డ్రిల్ నిర్వహించ డం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సంసిద్ధత కోసం ఈ మాక్ డ్రిల్ అనేది ఎంతో ముఖ్యమైన ప్రక్రియ అని తెలిపారు. వరదలు వచ్చి అత్యవసర పరిస్థి తులు ఏర్పడే ఏడు ప్రదేశా లను జిల్లాలో గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. 10 సెంటీ మీటర్స్ పైన వర్షపాతం నమోదు అయితే కృష్ణానది కి 6 నుంచి 7 లక్షల క్యూసె క్కుల నీరు వస్తే వాసు నగర్ లో వరద నీటితో అత్యవసర పరిస్థితి ఏర్పడే నేపథ్యంలో ఇక్కడ మోక్ డ్రిల్ నిర్వహిం చడం జరిగిందని ఆమె తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, నీటిపా రుదల శాఖ, ఇతర ముఖ్య మైన శాఖలు సమన్వ యంతో పనిచేసి ప్రజల ప్రాణాలను కాపాడే చర్యల ను సంసిద్ధతను ప్రదర్శించ డం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డీఎఫ్ఓ సురేష్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ ఈ వెంకట రమణ, ఆర్డీవో మేఘా గాంధీ, పీ ఆర్ ఈ ఈ అశోక్, జిల్లా మత్స్య అధికారి రెహమాన్, పశుసంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి, డీపీ ఆర్ వో రషీద్, కృష్ణా తహసిల్దార్ శ్రీనివాస్, వాసు నగర్ సర్పంచ్ సాశీతమ్మ, ఇతర జిల్లా శాఖల అధికారులు,రెవెన్యూ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్

వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బందెల చంటి



భద్రాద్రి జిల్లా, చర్ల : లోకల్ గైడ్ : ఉపాధి హామీ పనుల్లో రెండు సార్లు ఫోటోలు తీసే విధానం కారణంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బందెల చంటి తెలిపారు. సోమవారం పూసుగుప్ప గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి కార్మికులు మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో రెండు సార్లు ఫోటోలు అప్‌లోడ్ చేయడానికి గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పనిస్థలాల్లో మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం లేదని తెలిపారు. ఈ సందర్భంగా బందెల చంటి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్రపూరితంగా ఈ మార్పులు తీసుకువచ్చిందని విమర్శించారు. వెంటనే రెండు సార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19వ తేదీన మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కార్మికులు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామకృష్ణ, చిన్నబ్బి, గంగ, రాంబాబు, సోడి రమేష్, సుజాత, సీతమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని చేనేత సహకార తుది ఓటర్ల జాబితా విడుదల



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 18 : నిజామాబాద్ జిల్లాలోని ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా, అర్హులైన ఓటర్లతో కూడిన తుది ఓటర్ల జాబితా సిద్ధం చేయబడిందని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు ఎం. సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సహకార సంఘాలకు చెందిన సభ్యుల వివరాలు, అర్హతా ప్రమాణాలను సహాయ సంచాలకుల స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, తుది సభ్యత్వ జాబితాను అధికారికంగా ఆమోదించారు.నిబంధనలకు కట్టుబడి ఉంటూ, గతంలో విడుదల చేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలు, పేర్ల సవరణలు మరియు చేర్పులను పరిష్కరించి, ఈ తుది జాబితాను రూపొందించారని వివరించారు.సభ్యుల సమాచారం కోసం, ఈ ఖరారైన వివరాలను నిజామాబాద్‌లోని జిల్లా చేనేత మరియు వస్త్ర పరిశ్రమల శాఖ కార్యాలయ నోటీసు బోర్డుపై, అలాగే సంబంధిత ప్రాథమిక చేనేత సహకార సంఘాల కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారని తెలిపారు.ఎన్నికలు సజావుగా జరిగేలా చూసేందుకు, సహాయ సంచాలకుల స్థాయిలో ఆమోదించబడిన ఈ తుది ప్రతిపాదనలను రాష్ట్ర సహకార ఎన్నికల అధికారులకు వీలైనంత త్వరగా సమర్పిస్తామని ఆ అధికారి స్పష్టం చేశారు. తదుపరి ఎన్నికల ప్రక్రియ అంతా కేవలం ఈ తుది జాబితా ఆధారంగానే నిర్వహించబడుతుందని సహాయ సంచాలకులు వెల్లడించారు. అర్హులైన సభ్యులందరూ గమనించాలని కోరారు.

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 18 : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 150 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లుకాగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజా పాలన సభలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిగేలా పరస్పర సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం.. ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు 2కే రన్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల కింద రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలో 2కే రన్

హాజరైన ఎస్పీ మహేష్ బి గితే




రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:విద్యార్థులు, యువతలో ఆరోగ్యం.. ఫిట్నెస్ పై అవగాహన కల్పించేందుకు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా యువజన క్రీడా వారోత్సవాల్లో 2కే రన్ నిర్వహించామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. జెండా ఊపి 2 కే రన్ ప్రారంభించి.. అంబేద్కర్ విగ్రహం నుంచి బతుకమ్మ ఘాట్ వరకు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, చెత్తాచెదారం తొలగింపు పనులు చేయించామని వివరించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. ఆరు రకాల ప్రత్యేక వైద్య నిపుణులతో రోగ నిర్ధారణ పరీక్షలు, సేవలు అందించామని తెలిపారు. పోలీస్, రవాణా శాఖ ఆద్వర్యంలో అరైవ్.. అలైవ్ లో భాగంగా ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించామని డ్రైవర్లకు వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. చైల్డ్ సేఫ్టీ వీక్ కింద మూడేండ్ల వయసు, అలాగే ఆరేండ్లలోపు పిల్లలు తమ సమీపంలోని అంగన్వాడీ కేంద్రంలో నమోదు కావాలని, పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలని, డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ఈ నెల 19 వ తేదీన జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కెరీర్ ఆ నైపుణ్యాభివృద్ధి నిర్వహించి, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వంపై యువతకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన సిరిసిల్లలోని మినీ స్టేడియంలో క్రీడా దినోత్సవంలో భాగంగా కబడ్డీ, వాలీబాల్, కరాటే, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22వ జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.అదే రోజు ఉదయం వేములవాడ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, హరిత హోటల్ సమీపంలోని పరిసరాలలో స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం సిరిసిల్ల కొత్త చెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని కె కన్వెన్షన్ హాల్లో ఉదయం 9 గంటల నుంచి ఉద్యోగ సాధన పేరుతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో యువత, కిశోర బాల బాలికలు అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, డీవైఎస్ఓ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి, యూనిట్ అధికారులకు ఐటీడీఏ పీవో బీ రాహుల్ ఆదేశాలు



భద్రాచలం : లోకల్ గైడ్ :వివిధ ఆదివాసి, గిరిజన గ్రామాల నుండి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల కోసం అర్జీలు సమర్పించే గిరిజనులకు సేవలు సత్వరమే అందేలా సంబంధిత యూనిట్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ రాహుల్ ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎస్డీసీ ఆనంద్ కుమార్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడీఎంహెచ్వో సైదులతో కలిసి గిరిజనుల నుండి వచ్చిన దరఖాస్తులు, ఫిర్యాదులను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతంలోని పలు మండలాలు, గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరై తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ, గిరిజనుల సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల యూనిట్ అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గిరిజనుల ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యం చోటుచేసుకోకుండా క్రమం తప్పకుండా పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. సమస్యల వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గిరిజనుల సేవలో పారదర్శకత, బాధ్యతాయుత ధోరణితో పనిచేయాలని అన్నారు. గిరిజనులు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. గిరిజన దర్బార్ ద్వారా ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలని, అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు. గిరిజనులు సమర్పించిన అర్జీలలో పోడు భూముల సమస్యలు, పోడు పట్టాలలో పేర్ల మార్పు, పట్టా భూములకు విద్యుత్ సౌకర్యం, ఇందిరా గిరిజన వికాసం పథకం ద్వారా బోర్లు వేయించడం, జీవనోపాధి కోసం వ్యక్తిగత రుణాలు, నూతన ఇసుక మరియు మత్స్య సొసైటీలు ఏర్పాటు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం, పై చదువుల కోసం ఆర్థిక అభివృద్ధి తదితర అంశాలు ఉన్నాయని తెలిపారు. గిరిజన దర్బార్లో సమర్పించిన దరఖాస్తులను ఆన్లైన్లో ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజనుడికి విడతల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో సున్నం రాంబాబు, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీవో పవర్ వేణు, పీవీటీజీ అధికారి గన్యా, ఎల్టీఆర్డీటీ మనిధర్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, హౌసింగ్ ఏఈ హేమంత్, ఐసీడీఎస్ సూపర్వైజర్ చంద్రకళ, మేనేజర్ ఆదినారాయణ, ఇతర శాఖల సిబ్బంది నరేందర్, లింగా నాయక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చే మీడియా అక్రిడిటేషన్ కార్డుల అందజేత



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 18 : నిజామాబాదు జిల్లాలో పని చేస్తున్న గుర్తింపు కలిగిన జర్నలిస్టులకు 2026 - 2028 కాల వ్యవధి కోసం మంజూరైన తొలి విడత అక్రిడిటేషన్ కార్డులను జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఛైర్మన్, కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం లాంఛనంగా అందజేశారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఏ.నర్సింలు, భూపతి, సాయిప్రసాద్, రాందయానంద్, శ్రీకాంత్, గౌస్, మాజీద్ తదితరులు కలెక్టర్ చేతుల మీదుగా నూతన కార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ఓ పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలి రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంపు, అన్ లోడింగ్ చేయడం, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి రోజు ఉదయం 08.00 గంటలకు జిల్లా కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారు.జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. హమాలీలకు భోజనం, వైద్య సేవలు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి ఐడీఓసీతో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో నిర్వహణ

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజావాణికి 208 దరఖాస్తుల రాక



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలలోనూ ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 208 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్రీమతి ఇలా త్రిపాఠి ఐ.ఏ.ఎస్




నిజామాబాదు జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 18:ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాదు జిల్లా శాఖ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు ఇలా త్రిపాఠి ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టరేట్లోని ఎన్.ఐ.సి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సంస్థ సమాజ సేవలో విశిష్ట పాత్ర పోషిస్తోందని, ముఖ్యంగా



తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతర రక్త మార్పిడి సేవలను అందిస్తూ వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, సేవా సంస్థలు ముందుకు వచ్చి రెడ్ క్రాస్ సభ్యత్వం తీసుకుని సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని కోరారు. అలాగే అన్ని శాఖలు తరచుగా రక్తదాన శిబిరాలను నిర్వహించి అవసరమైన రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా సహకరించాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన డేటా నమోదు కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. రెడ్ క్రాస్ ఆన్లైన్ సభ్యత్వ నమోదు కోసం ఒఒఒ.తీవఎ-ఎతీశీం.ఎస్త్రన్త్ర.స్త్రశీజ.ఱఅ? వెబ్సైట్ను వినియోగించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా "ఏవశ్రీఖఅస్త్రుఱఖ =వఎ జతీశీం" మొబైల్ యాప్ ప్లే స్టోర్ మరియు ఊూా ప్లాట్ఫారమ్లలో అందుబాటులో ఉందని, దాని ద్వారా కూడా ఎవరైనా సులభంగా ఆన్లైన్ సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు.రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స అంజనేయులు మాట్లాడుతూ, జిల్లాలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ కార్యకలాపాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు కె. కిరణ్ కుమార్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి బి గీత, డి.ఆర్.డి.ఓ పిడి రెడ్ క్రాస్ సభ్యత్వ నోడల్ ఆఫీసర్ సాయన్న ,సి.ఈ.ఓ జిల్లా పరిషద్ సాయ గౌడ్ ,డిప్యూటి లేబర్ కమీషనర్ యాదయ్య ,రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ అబ్బాపూర్ రవి, మోపాల్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, నిజామాబాద్ డివిజన్ వైస్ చైర్మన్ ఏ. మురళీకృష్ణ, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణతో పాటు రెడ్ క్రాస్ మరియు జూనియర్ మండల్ కోఆర్డినేటర్స్ రమేష్, శ్రీనివాస్, వెంకటేష్ మరియు సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ సత్వర స్పందన ఇద్దరికి తక్షణమే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేత

కృతజ్ఞతలు తెలియజేసిన దివ్యాంగులు



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:ఇద్దరు దివ్యాంగుల ఇబ్బందులను చూసి చలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సత్వరం స్పందించారు. వారి సమస్యకు పరిష్కారం చూపారు.కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల శ్రీనివాస్, ముస్తాబాద్ మండలం గూడెం కొమిరే పరశురాములు అనే దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి పని నిమిత్తం వచ్చారు. వారిని చూసిన జిల్లా కలెక్టర్ ఎక్కడి నుంచి వచ్చారు? ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు.తాము పనులపై బయటికి వెళ్లేందుకు, పనులు చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని గుర్తించి తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వారికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వారి ఇద్దరికి వెంటనే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, హెల్మెట్ జిల్లా కలెక్టర్ అందజేశారు. తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు : కలెక్టర్ కె. హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) మే 18 :సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను జిల్లా కలెక్టర్ స్వయంగా స్వీకరించారు ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులను సత్వరంగా పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజావాణికి వస్తున్నారని, అందువల్ల ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా వచ్చిన మొత్తం 98 దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఎస్డీసీ వరలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సన్మార్గంతో భగవంతుడి సేవలో తరిం చాలి

స్వామి విద్యా సింధు మాధవ తీర్థులు



నారాయణపేట మే 18 లోకల్ గైడ్,:ప్రతి ఒక్కరు దైనందిన కార్య క్రమాలతో పాటు సన్మార్గంలో నడిచి భగవంతుడి సేవలో తరించాలని బెంగళూరుకు చెందిన స్వామి విద్యా సింధు మాధవ తీర్థులు అన్నారు. అధిక మాసాన్ని పురస్కరిం చుకొని సోమవారం నారా యణపేట లక్ష్మీ నరసింహ సహిత రాఘవేంద్ర స్వామి ఆలయంలో భాగవత సప్త కార్యక్రమం ప్రారంభం నిర్దే శించి స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఏడు రోజులపాటు ఉదయం సాయంత్రం స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తారు. మధ్యాహ్నం శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీదేవి భూదేవి లక్ష్మీ నరసింహ స్వామి విగ్రహాలకు సంస్థాన పూజ స్వామీజీ నిర్వహించారు. కార్యక్ర మంలో యజ్ఞ నారాయణ పురోహిత్, జోషి రఘు ప్రేమాచారి రాఘవేంద్ర సేవాసమితి సభ్యులు నరసింహ చారి అనిల్ జయ సాయి శ్రీవత్స నరసింహ సీతారాం రావు ధరణి ధర్ దీక్షిత్ శేషు శక్తిపీఠం స్వామి శాంతానందా యజుర్వేద స్మార్త పండితులు విద్వాన్ విభావసు పురోహిత్, విద్వాన్ ధీరజ్ ప్రహ్లాద తదితరులు ఉన్నారు.

## యువత ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం యోగాతో డ్రగ్స్‌కు చెక్

-కారేపల్లి జూనియర్ కాలేజీ మైదానంలో భారీ అవగాహన సదస్సు

-మాదకద్రవ్యాల నివారణే ధ్యేయంగా ప్రభుత్వ కార్యక్రమం

హాజరైన మండల అధికారులు, సర్పంచులు, విద్యార్థులు




ఖమ్మం జిల్లా , కారేపల్లి : లోకల్ గైడ్, మే 18 : సింగరేణి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానం ఆరోగ్య చైతన్యానికి వేదికగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం లక్ష్యంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం విజయవంతమైంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి మండల కేంద్రంలో యువతకు ఆరోగ్య చైతన్యం కల్పిస్తూ యోగ ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కారేపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సింగరేణి మండల తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు , ఇన్ చార్జ్ ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ పాల్గొని యువతకు యోగ సాధన అవసరాన్ని వివరించారు. మాదకద్రవ్యాలు యువ జీవితాలను నాశనం చేస్తాయని, యోగ మనసుకు ప్రశాంతతను, శరీరానికి దృఢత్వాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్ , సర్పంచులు పూసం ఎల్లయ్య , దండు ప్రవీణ్ ,మేదరి వీర ప్రతాప్( టోనీ) , భూక్య బాలు , వాంకుడోత్ హనుమంతరావు , వివిధ గ్రామపంచాయతీల కార్యదర్శులు , యువకులు , విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.



## రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా కలెక్టర్ సమీక్ష

హాజరైన జిల్లా ఎస్పీ మహేష్ బి గితే



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:జిల్లాలోని రైస్ మిల్లర్లు, లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చడం, ధాన్యం అన్ లోడింగ్ తదితర అంశాలపై జిల్లాలోని రైస్ మిల్లర్లు, లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా రైస్ మిల్లులు, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్, కొనుగోలు కేంద్రాలకు వాహనాల తరలింపుపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాల సంఖ్య మరింత పెంచాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లర్లు తమ మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అన్ లోడింగ్ లో వేగం పెంచి.. వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపాలని సూచించారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, డీటీసీపీఓ అన్సార్, ట్రాన్స్పోర్ట్ అధికారి, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## జన జాతీయ గరిమా ఉత్సవం పోస్టర్ల ఆవిష్కరణ



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:గిరిజన మంత్రిత్వ శాఖ ప్రభుత్వం జన జాతీయ గరిమా ఉత్సవం 2026 (జన భాగధారి అభియాన్ ) కింద జిల్లాలోని వీర్నపల్లి మండలంలో మద్దిమల్ల, గర్జనపల్లి గ్రామాలను అలాగే రుద్రంగి మండలం మానాల గ్రామమును ఎంపిక చేశారు. ఈ పథకం ద్వారా అవగాహన కల్పించేందుకు ఈ నెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఆయా గ్రామాలగిరిజన ప్రజలు ఈ ప్రత్యేక



క్యాంపులలో ఆధార్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి. కిసాన్ క్రెడిట్ కార్డ్, పీ ఎం జన ధన యోజన, అటవీ హక్కుల చట్టం పట్టా, రేషన్ కార్డ్, కుల ధ్రువ పత్రం, ఆరోగ్య సేవలు, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా చేయడం ముఖ్య ఉద్దేశం.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జన జాతీయ గరిమా ఉత్సవం 2026 (జన భాగిదారి అభియాన్) ను పోస్టర్లను ఆవిష్కరించారు. వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల తండా, సీతారామ నాయక్ తండా, జవహర్ లాల్ నాయక్ తండా, రుద్రంగి మండలంలోని వీరుని తండా, అడ్డబోర్ తండా, దేగావాత్ తండా, గాయిదిగుట్ట తండా, రుష్మా నాయక తండా, సర్పంచ్ తండా, మానాల, బడి తండా, చింతామణి తండా లలోని గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పోస్టర్ల..ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా టూరిజం, హెరిటేజ్ అండ్ లాంగ్వేజ్ కల్చర్ పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ జి నగేష్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసాచారి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఏ రాందాస్, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ తో కలిసి ఆవిష్కరించారు.

## జిల్లా స్థాయి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సమన్వయంతో విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష



రాజన్న సిరిసిల్ల జిల్లా, లోకల్ గైడ్ తెలంగాణ:ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఈ నెల 22వ తేదీన శుక్రవారం జిల్లా స్థాయి సభ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 22 వ తేదీన శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్ లో జిల్లాస్థాయి సభ నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సోమవారం సమీక్షించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సభలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరు గ్యారంటీలు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలని, దానిని కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు.మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, వివిధ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించాలని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.సభలు తెలంగాణ రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) స్వాగతోపన్యాసం, పరిచయం అలాగే సీఎం గారి సందేశం వినిపించాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ.500 కే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి



(200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్న రకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారుల వివరాలు, సాధించిన విజయాలపై శాఖల ద్వారా సమాచారం ఇవ్వాలని, లబ్ధిదారుల పేర్లను చదవాలని, లబ్ధిదారుల అభిప్రాయాలు, అనుభవాలు చెప్పాలని తెలిపారు. ఇప్పటి దాకా అమలు చేస్తున్న వాటిపై చర్చించాలని, భవిష్యత్లో చేపట్టనున్న పనులపై తీర్మానాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి.. వేడుకలు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు.సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాజేందర్ రెడ్డి, కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సన్నద్ధతను చాటిన మాక్ ఎక్సర్ సైజ్ పర్యవేక్షించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

జిల్లా జనరల్ ఆసుపత్రి, రఘునాథ చెరువు ప్రాంతాలలో కొనసాగిన మాక్ డ్రిల్

వాస్తవికతను మరిపించేలా సహాయక చర్యలు

జిల్లా యంత్రాంగాన్ని అభినందించిన జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులు

డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం

విశేష సేవలు అందించిన ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 18 : వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు వీలుగా సోమవారం నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన మాక్ ఎక్సర్ సైజ్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాలు విపత్తుల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా



సమాయత్తం అయి ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. విపత్తుల సమయాలలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేలా మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేపట్టిన సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా కొనసాగాయి. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో వ్యవహరిస్తూ, విపత్తుల సమయాలలో ఏవిధంగా వ్యవహరించాలన్నది కళ్ళకు కట్టినట్టు ఆచరణాత్మక రూపంలో చేసి చూపించారు. డ్రోన్ లు, వాటర్ బోట్ లు, అంబులెన్స్ లు, అగ్నిమాపక శకటాలు, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై సన్నద్ధతను చాటిచెబుతూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందింపజేశాయి.

ఆయా శాఖల అధికారులతో పాటు ఎస్.డీ.ఆర్.ఎఫ్, ఎన్.సీ.సీ, ఆపదమిత్ర వాలంటీర్లు మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఖిల్లా రఘునాథ చెరువు వద్ద రెండు చోట్ల ఏకకాలంలో విపత్తుల నిర్వహణపై మాక్ ఎక్సర్ సైజ్ జరిపారు. రఘునాథ చెరువు వద్ద జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాలు కురిసి వరద ప్రవాహం కారణంగా చెరువు నీటిలో బాధితులు చిక్కుకున్న సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన తక్షణ చర్యలను వాస్తవిక రూపంలో మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా చేసి చూపించారు. చెరువులో మునిగిపోతున్న వారిని డ్రోన్ల సహాయంతో గుర్తిస్తూ, బోట్ల ద్వారా ఎస్.డీ.ఆర్.ఎఫ్ సిబ్బంది వారిని కాపాడడం, ఒడ్డుకు చేర్చిన వెంటనే వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స జరిపి అంబులెన్స్ లలో ఆసుపత్రికి తరలించడం వంటి సహాయక చర్యలు అధికార యంత్రాంగం సన్నద్ధతను నిరూపించాయి. సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో రిలీఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు. అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, డిచ్పల్లి 7వ పోలీస్ బెటాలియన్ అధికారి సత్యనారాయణ, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఆంజనేయస్వామి, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, ఆర్ అండ్ బీ ఈ.ఈ రంజిత్, శివకుమార్ ఇతర అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షించారు. కాగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వరద జలాలు చుట్టుముట్టిన సమయంలో గ్రౌండ్ ఫ్లోర్ లోని పేషెంట్లను హుటాహుటిన పై అంతస్తులకు చేర్చి, వారి ప్రాణాలను ఎలా కాపాడాలి అనే దానిపై మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ఆచరణాత్మక రీతిలో చేసి చూపించారు. నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నాగమోహన్ తదితరులు పర్యవేక్షించారు. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఫిషరీస్, హెల్త్, ట్రాన్స్పోర్ట్ తదితర అన్ని శాఖలు చక్కటి సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ మాక్ ఎక్సర్ సైజ్ ను విజయవంతం చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. అన్ని శాఖల అధికారులను సమాయత్తం చేస్తూ, ముందస్తుగానే పక్కా పర్యవేక్షణతో ప్రణాళికాబద్ధంగా కృషి చేయడం జరిగిందన్నారు. ఆకస్మిక వరదలు, విపత్తులు సంభవించిన సమయాలలోనూ వాటిని ధైర్యంగా ఎదుర్కొంటారనే నమ్మకాన్ని మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా కలిగించడం జరిగిందన్నారు. విపత్తుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం జరుగుతుందని, ప్రకృతి వైపరీత్యాలు, కుంభవృష్టి వర్షాలు కురిసిన సమయాలలో సమర్ధవంతంగా సేవలు అందించేందుకు మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ బి ఐ బ్యాంకు ముందు నాలాపై వంతెన తొలగించాలి...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో ఎస్ బి ఐ బ్యాంకు ముందు నాలాపై నిర్మించిన అక్రమ వంతెనను తొలగించాలని ఎంసిపిఐ యు జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ అక్రమ నిర్మాణ విషయమై గత 2నెలల క్రితం అక్రమ వంతెన నిర్మాణం జరుపుతున్నారని బెల్లంపల్లి తాహసిల్దార్,మున్సిపల్ కమిషనర్ లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.అక్రమ నిర్మాణం చేపట్టి 2నెలలు కావస్తున్నా బెల్లంపల్లి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు.అక్రమ నిర్మాణాలు ఎక్కడ ఎవరు చేపట్టినా కూడా ఎంసిపిఐ యు పార్టీ చూస్తూ ఊరుకునేది లేదని,పేదవారు చిన్న బండి పెట్టుకొని నడిపిస్తే అతడిని ఆగమాగం చేస్తున్న అధికారులు కమర్షియల్ కాంప్లెక్స్ కు అంత పెద్ద వంతెన నిర్మించిన కూడా పట్టించుకోకపోవడం అమానుషం అని,ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు పట్టణంలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని కోరారు.

## వాజేడులో మే 24 న జరగబోయే మహా గర్జన సదస్సును ఆదివాసి యువత తరలి రావాలని పిలుపు....



ములుగు జిల్లా,వాజేడు (లోకల్ గైడ్ ) :- ఉద్యమాలతోనే భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు కలలు సాధ్యమవుతాయని గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు.వాజేడు మండలం ఆదివాసి గూడాలైన,చింతూరు, గెర్రగూడెం, పేరూరు చెరుకూరు పర్యటించిన రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి,మోరుమూరు గ్రామంలో సమావేశమై,ఈ సంధర్భంగా మాట్లాడుతూ. ఉద్యమాలతోనే భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు జరుగుతుందని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులను అమాయకులుగా తీర్చిదిద్దుతు,విద్యారంగంలో అణగదొక్కే ప్రయత్నాలు ఈ రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని, దీనికి నిదర్శనంగా భద్రాచలం నియోజకవర్గం లో ఎలాంటి ఇనిస్ట్యూట్,యూనివర్సిటీ లేక ఆదివాసులు విద్యా రంగంలో వెనకబాటుతనాన్ని ఇంకా వదలటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆదివాసుల అమాయకత్వానికి గుర్తించి భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్లో ప్రాంతంలో ఆదివాసుల కంటూ ఒక ప్రత్యేక చట్టాలను పొందుపరిచినప్పటికీ,ఈ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసి చట్టాలను తెలుసుకొనివ్వకుండా వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కేస్తూ ఏజెన్సీ సంపదనంతా గిరిజనేతరులు దోచుకు తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాలు పూర్తిస్థాయిలో అమలు జరగాలంటే ఆదివాసులకు భద్రాచలం కేంద్రంగా నాయకళాశాల ఏర్పాటు చేయాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఆదివాసి జీవన విధానం మెరుగుపడాలంటే భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ,మే 24న వాజేడు మండలంలో జరగబోయే గోండ్వాన న్యాయ కళాశాల సాధన సదస్సుకి ఆదివాసి,యువతి,యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎస్పి ములుగు జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, ఆదివాసీ నాయకులు బోదేబోయిన సురేష్,పద్దం సుధాకర్,మడకం తిరుపతి,రాజు,కారం రాజబాబు, పర్షిక మోహనరావు,ఆదివాసి మహిళలు పాల్గొన్నారు.

## ప్రమాదాలు సంభవించినప్పుడు మనల్ని మనం రక్షించుకుంటూనే ఎదుటి వారిని కాపాడవలసిన అవసరం ఉంది .

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ .



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 18. (లోకల్ గైడ్).ప్రమాదాలు సంభవించినప్పుడు మనల్ని మనం రక్షించుకుంటూనే ఎదుటివారిని కాపాడాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసర



ప్రతిస్పందన, సంసిద్ధత, వ్యవస్థలను బలోపేతం చేసే విషయమై జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల ఆదేశాల మేరకు సోమవారం నల్గొండ జిల్లా, చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాష్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీ (సైమ్ ల్యాబ్స్) లో నిర్వహించిన "మాక్ డ్రిల్" నమూనా విన్యాసానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వరదలు, అటవీ అగ్ని ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగాల ప్రతిస్పందన, సంసిద్ధతపై వివిధ జిల్లాలలో సంసిద్ధత కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా నల్గొండ జిల్లా పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన, సంసిద్ధతకు ఎంపిక కాగా, ఈ నమూనా కార్యక్రమాన్ని పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాస్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీలో నిర్వహించడం జరిగింది. నమూనా విన్యాసాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు సంబంధిత కంపెనీ తక్షణమే స్పందించాలని, ఫైర్, వాటర్, వైద్య ఆరోగ్య శాఖల బృందాలు నిర్దేశించిన సమయంలో అప్రమత్తం కావాలన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ వారిని వారు కాపాడుకుంటూనే ,తోటి వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల సమయంలో అత్యవసర ప్రతిస్పందనతో పాటు, పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండడం, తద్వారా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు నమూనా విన్యాసాలు ఉపయోగపడతాయన్నారు. దీని ద్వారా పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు ఉద్యోగులను ఏ విధంగా సంరక్షించుకోవాలో తెలుస్తుందని చెప్పారు. ఇలాంటి విన్యాసాల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు చనిపోయేవారి సంఖ్యను పూర్తిగా తగ్గించడంతోపాటు, ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య చికిత్సలను అందించవచ్చని, తద్వారా సంఘటన సంభవించినప్పుడు ఎంతవరకు సిద్ధంగా ఉన్నామనే విషయం అర్థం అవుతుందన్నారు.ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు హైదరాబాద్ నుండి కార్యక్రమాన్ని ఆన్ లైన్ లో పరిశీలించారు.

## కరెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

-తక్షణమే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు



ఖమ్మం జిల్లా, కారేపల్లి : లోకల్ గైడ్, మే 18 : కారేపల్లి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ లోని తులిస్య తండా గ్రామంలో గత సంవత్సరం నుండి గ్రామ ప్రజలు లో ఓల్టేజ్ కరెంట్ సమస్యతో లోనవ్వడం జరుగుతుంది.ఈ లో వోల్టేజ్ సమస్యను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్య అనుచరులైన ఎస్. ఎన్. నాయక్, సర్పంచ్ దండు ప్రవీణ్ లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ విద్యుత్ శాఖ డీ ఈ కీ ఫోన్ చేసి సమస్యకు తక్షణమే అమలు చెయ్యాలని ఆదేశాలు అందించడం జరిగింది. వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది ఎ ఈ కీ ఆదేశాలు అందించగా వెంటనే నూతన ట్రాన్స్ఫార్మర్ ను నిర్మించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్, ప్రజలు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు మరియు విద్యుత్ శాఖ అధికారులకు అభినందనలు తెలిపినారు.

# 'సైమ' ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షురాలిగా గోలి నవ్య రెడ్డి నియామకం.



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మే 18. (లోకల్ గైడ్)సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ (సైమ) అంతర్జాతీయ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షురాలిగా అట్లాంటాకు చెందిన ప్రముఖ ప్రవాస భారతీయురాలు, తెలంగాణలోని నల్లగొండ జిల్లా వాస్తవ్యులు గోలి నవ్య రెడ్డి నియమితులయ్యారు. అమెరికాలోని అట్లాంటా నగరంలో ఆదివారం ఘనంగా జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో 'సైమ' ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి ఆమెకు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండర్ ప్రెసిడెంట్ నకిరేకంటి స్వామి మాట్లాడుతూ 'సైమ' కార్యకలాపాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఎన్ఆర్ఐ సెల్ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నవ్య రెడ్డి నేతృత్వంలో ఈ విభాగం అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం అవుతుందని, ఆమె తన వృత్తిపరమైన అనుభవంతో బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.తమపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించినందుకు గోలి నవ్య రెడ్డి 'సైమ' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న సౌత్ ఇండియన్ మీడియా ప్రతినిధులను, ప్రవాస భారతీయులను ఒకే తాటిపైకి తెస్తూ అసోసియేషన్ ఆశయాల సాధనకు శరవేగంగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని పలువురు ప్రవాస భారతీయులు, ప్రముఖులు, మీడియా ప్రతినిధులు పాల్గొని నవ్య రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# SSCఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం




ములుగు జిల్లా,వాజేడు (లోకల్ గైడ్) :- ములుగు జిల్లా వాజేడు మండలంలో 2025 26 విద్యా సంవత్సరంలో పాసైన విద్యార్థులలో మొదటి ముగ్గురు విద్యార్థులకు సాల్వలతో తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించడమైనది ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి శాఖ అధికారి శ్రీకాంత్ గారు మాట్లాడుతూ మీ భవిష్యత్తు కోసం ప్రణాళిక వేసుకోవడం ఒక కష్టమైన పనిలా అనిపించవచ్చు కానీ సరైన కెరియర్ మార్గదర్శకత్వం మరియు ఆలోచనత్మకమైన విధానంతో మీరు విజయవంతమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తేజవతి వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు మార్గ నిర్దేశకులు అని పాఠశాల విద్యానుండే ఉన్నతంగా చదివి మంచి భవిష్యత్తుకును ఏర్పరచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కోరిక స్వరూప్ సింగ్, శ్రీకాంత్, మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# చర్ల సాగర్ హాస్పిటల్‌లో గైనకాలజిస్ట్ లేకుండానే స్కానింగ్ మిషన్ నిర్వహణ

**ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆదేశాల మేరకు సాగర్ హాస్పిటల్ స్కానింగ్ గది సీజ్**



భద్రాద్రి జిల్లా, చర్ల : లోకల్ గైడ్ :భద్రాద్రి జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ఆదేశాల మేరకు, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరీష్ ఆధ్వర్యంలో చర్ల మండలంలోని స్కానింగ్ సెంటర్లు మరియు ఆసుపత్రులపై ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల యాజమాన్యాలకు సంబంధిత అనుమతులు తప్పనిసరిగా పొందిన తర్వాతే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు నిర్వహించాలని అధికారులు సూచించారు. తనిఖీలలో భాగంగా చర్ల రఘుధియేటర్ ప్రక్కన ఉన్న సాగర్ హాస్పిటల్‌లో గైనకాలజిస్ట్ లేకుండానే స్కానింగ్ మిషన్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గ్రామపంచాయతీ మరియు పోలీస్ శాఖ అధికారుల సమక్షంలో స్కానింగ్ మిషన్ ఉన్న గదిని సీజ్ చేశారు. దీనికి సంబంధించిన నివేదికను జిల్లా వైద్యాధికారికి సమర్పించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామదాస్, చర్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, గ్రామపంచాయతీ వీఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జెన్ జాతీయ గరిమ ఉత్సవ్-2026 ప్రారంభం

**గిరిజనులకు సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరేలా చర్యలు : ఐటీడీఏ పీవో బీ రాహుల్**




భద్రాచలం : లోకల్ గైడ్ :ఏజెన్సీ మారుమూల అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా అందించేందుకు "జెన్ జాతీయ గరిమ ఉత్సవ్-2026" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. "జన్ భాగీదారి సబ్సే దూర్ -- సబ్సే పహలే" నినాదంతో అధికారులు గ్రామాలకు వెళ్లి గిరిజనులను చైతన్యపరుస్తారని చెప్పారు. సోమవారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుమూల అటవీ ప్రాంతాలలో నివసించే గిరిజనుల జీవన విధానం, సంప్రదాయాలు ప్రత్యేకమైనవని పేర్కొన్నారు. గిరిజన యువకులు, మహిళల సహకారంతో గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సమస్యలను గుర్తించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. గ్రామాలలోని ఆదిసేవ కేంద్రాలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించి గిరిజన సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం, తాగునీరు, మేకల పెంపకం, మునగ సాగు, జీవిత బీమా, ఆదిసురక్ష బీమా వంటి పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే జాబ్ కార్డులు, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఓటర్ కార్డులు, బ్యాంకు ఖాతాలపై అర్హులైన వారికి అక్కడికక్కడే దరఖాస్తులు స్వీకరించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ పరిధిలోని 130 గ్రామాలు, ఖమ్మం జిల్లాలోని 30 గ్రామాలలో అధికారులు ఇంటింటికీ తిరిగి గిరిజనుల సమస్యలు తెలుసుకుని సంక్షేమ పథకాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తారని తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహించి నిపుణులైన వైద్యులతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని, ఐటిడిఏ యూనిట్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఎంపీడీవోల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించనున్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు తప్పనిసరిగా తీసి ప్రత్యేక యాప్ ద్వారా ఐటిడిఏ కార్యాలయం మరియు జిల్లా నోడల్ అధికారికి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, పీవీటీజీ అధికారి గన్యా, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడీఎంహెచ్‌వో సైదులు, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, ఏపీఓ పవర్ వేణు, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏవో సున్నం రాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం జర్నలిస్టుల ఇంటి కల... జూన్ 2తో నెరవేరుతుందా?



లోకల్ గైడ్' ఖమ్మం- టి. సంతోష్ చక్రవర్తి, టిడబ్ల్యూజేఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడుఖమ్మం, మే 18:ప్రజల హక్కుల కోసం నిరంతరం కలం పట్టే జర్నలిస్టులు నేడు తమ ఇంటి హక్కు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని టిడబ్ల్యూజేఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు టి. సంతోష్ చక్రవర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదంతో ఖమ్మం జర్నలిస్టుల కోసం 23 ఎకరాల 2 కుంటల భూమిని కేటాయించినప్పటికీ, ఇప్పటికీ ఆ ప్రక్రియ అమలులోకి రాకపోవడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిన ఖమ్మం జర్నలిస్టులు నేడు అద్దె ఇళ్లలో జీవిస్తూ తమకోసం కనీస గృహ భద్రత కోసం ఎదురుచూడటం దురదృష్టకరమన్నారు.ఇటీవల ప్రభుత్వం జూన్ 2లోపు జర్నలిస్టులకు తీపి కబురు అందిస్తామని ప్రకటించడం రాష్ట్రవ్యాప్తంగా ఆశలు పెంచిందని, అయితే ఖమ్మం జర్నలిస్టుల కోసం ఇప్పటికే ఆమోదం పొందిన భూమి అంశంపై మాత్రం స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికే నిర్ణయం తీసుకున్న అంశాన్ని అమలు చేయకుండా కొత్త హామీలు ఇవ్వడం జర్నలిస్టుల్లో అయోమయాన్ని మరింత పెంచుతోందన్నారు. ప్రజల ఇళ్ల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులకు తమకోసం మాత్రం న్యాయం జరగకపోవడం ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు.కొన్ని జర్నలిస్టు సంఘాలు హౌసింగ్ సొసైటీ ద్వారా స్థలాలు సాధ్యం కావని చెబుతుండగా, మరికొన్ని సంఘాలు ఏదో ఒక కోటా కింద అయినా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకోవడం విచారకర మన్నారు. అక్రిడేషన్ల పేరుతో అసలు పోరాటమైన గృహ హక్కుల అంశాన్ని పక్కనపెట్టి, కార్డుల కోసం జర్నలిస్టులు ఎదురుచూడాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని విమర్శించారు. ప్రజల హక్కుల కోసం ప్రభుత్వాలను ప్రశ్నించే జర్నలిస్టులు, తమ హక్కు విషయంలో మాత్రం ఎందుకు యాచించాల్సి వస్తోందనే ప్రశ్న ఇప్పుడు జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోందన్నారు.ఖమ్మం జిల్లా పోరాటాల చరిత్ర కలిగిన నేల అని, హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలకు ఈ జిల్లా సాక్ష్యమైందని గుర్తుచేశారు. ఇప్పుడు జర్నలిస్టుల గృహ హక్కుల అంశం కూడా అదే స్థాయి ఉద్యమంగా మారే పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఇప్పటికే ఆమోదం పొందిన 23 ఎకరాల భూమిని వెంటనే జర్నలిస్టులకు కేటాయించాలని, సంఘాలు వ్యక్తిగత భేదాలు పక్కనబెట్టి ఒకే వేదికపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని టి. సంతోష్ చక్రవర్తి పేర్కొన్నారు.

# బాలవికాస ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో ఆదర్శ గ్రామ నిర్మాణ గ్రామసభ

**గ్రామ ప్రజల ఐక్యతతోనే ఆదర్శ గ్రామం సాధ్యం : వసంత**




ములుగు జిల్లా, గోవిందరావుపేట : లోకల్ గైడ్ :ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం గాంధీనగర్ గ్రామపంచాయతీలో సోమవారం గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామ నిర్మాణంపై అవగాహన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



సుమారు 350 మంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలవికాస ఆదర్శ గ్రామం పథకం సీనియర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వసంత మాట్లాడుతూ, ఆదర్శ గ్రామం అంటే కేవలం రోడ్లు, భవనాలు నిర్మించుకోవడం కాదన్నారు. గ్రామ ప్రజలు క్రమశిక్షణతో, ఐక్యమత్యంతో, ఒకే మాట ఒకే బాటలో నడుస్తూ గ్రామ అభివృద్ధికి కలిసి పనిచేస్తేనే ఆదర్శ గ్రామం నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. అభివృద్ధి గ్రామానికి, ఆదర్శ గ్రామానికి తేడా ఉందని పేర్కొంటూ, డబ్బులతో అభివృద్ధి సాధ్యమవుతుందని, కానీ ఆదర్శ గ్రామం కోసం ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహకారం, గ్రామ వనరుల సమర్థ వినియోగం అవసరమని వివరించారు. గ్రామ సమస్యలను గ్రామస్తులంతా కలిసి పరిష్కరించుకునే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కోసం ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న మాట్లాడుతూ, బాలవికాస సంస్థ నిర్వహించే ప్రతి కార్యక్రమానికి గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. బాలవికాస ఆదర్శ గ్రామ నిర్మాణ పథకానికి తమ గ్రామాన్ని ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. గ్రామాభివృద్ధి కమిటీల ఏర్పాటుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, స్వచ్ఛందంగా ముందుకొచ్చిన కమిటీ సభ్యులను అభినందించారు. అందరూ కలిసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వల్లపు మహేష్, పంచాయతీ కార్యదర్శి రఘు, వార్డు సభ్యులు మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, రమావత్ సంధ్య, తేజావత్ హుని, లిక్కి కుమారస్వామి, లకావత్ ఈర్య, బాలవికాస ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, డెవలప్మెంట్ ఏజెంట్లు కె. వినయ్‌కుమార్, శంకర్, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి: సీఐ శివశంకర్

నారాయణపేట మే 18:(లోకల్ గైడ్)బక్రీద్ పండుగ ను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని నారాయణపేట సి ఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సాయంత్రం ముస్లిం మత పెద్దలు, ఖురేషి సంఘ సభ్యులు స్లాటరింగ్ హౌస్ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ పండుగను పరస్పర సామరస్య వాతావరణంలో, ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. చట్ట నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ముఖ్యంగా ఆవు లు, దూడలను వధించడం పూర్తిగా నిషేధ మని స్పష్టం చేశారు. వెటర్నరీ వైద్యుల ధృవీకరణ పత్రం (సర్టిఫికేట్) ఉన్న పశువులను మాత్రమే వధించాల్సిందిగా సూచించా రు.అలాగే ఎటువంటి అను మతులు లేకుండా గోవులను రవాణా చేయరాదని హెచ్చ రించారు. అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాల పై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహ కరించాలని కోరారు.సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధం గా పోస్టులు, వీడియోలు, సందేశాలు పంపరాదని, అలాంటి చర్యలపై సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చ రించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలపై వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ప్రజలందరూ పరస్పర గౌరవ భావంతో పండుగను ఆనందంగా జరుపుకొని జిల్లాలో శాంతి భద్రతలను కాపాడాలని అధికారులు కోరారు.

# కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం మెడల్ వంచి ధాన్యం కొనిపించారు.

**బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. నల్లగొండ సూర్యపేట జిల్లాల సభ్యత నమోదు ఇంచార్జ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.**



నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. మే 18. (లోకల్ గైడ్)కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం మోడల్ ఉంచి ధాన్యం కొరిపించారని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నల్లగొండ జిల్లాల సభ్యత్వ నమోదు ఇంచార్జ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.నల్లగొండ కలెక్టర్



కార్యాలయం ఎదుట బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కెసిఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఇందిరాపార్కు వద్ద ఢిల్లీలో టిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేసి కేంద్ర ప్రభుత్వాన్ని ధాన్యం కొనుగోలు చేసేలా కృషి చేశారన్నారు. అప్పట్లో తాను రాజకీయాల్లో లేను అన్నారు. ధాన్యం కొనుగోలు కన్నా మూడు నెలల ముందు నుంచే కేసీఆర్ రివ్యూలు నిర్వహించే వారన్నారు. అందువలన రైతులు చాలా ఆనందంగా బతికే వాళ్ళు అన్నారు. 70 వేల రైతుబంధు ఇచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ నే అని కొనియాడారు. నాటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కోసం రివ్యూలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. డబ్బు సంచులు ఢిల్లీకి మోస్తున్నాడు అన్నారు. బండి సంజయ్ కొడుకు కేసులో మహిళా కేసు పెడితే కామపైన రిటర్న్ కేస్ పెట్టిన చరిత్ర రేవంత్ రెడ్డి సర్కార్ ది అన్నారు. దీనిపై కేసీఆర్ కేటీఆర్ స్పందిస్తేనే న్యాయం జరిగిందన్నారు. సూర్యాపేట శాసనసభ్యులు మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ సర్కారుకు ముందు రైతులు ధర్నా చేయని రోజు లేదు. మళ్లీ ఇవాళ 12 ఏళ్ల తర్వాత అదే పరిస్థితి నెలకొన్న దానికి విమర్శించారు. కాంగ్రెస్ చేసిన పాపం.... రేవంత్ సర్కార్ చేసిన శాపంతో రైతులు మళ్లీ ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యమ సమయంలోనే కేసీఆర్ జిల్లాలో ఊరు తిరిగి కష్టాలను చూశారన్నారు. అందుకే ఇప్పుడే కేసీఆర్ నల్లగొండ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని భావించారు అన్నారు. 2013 లో మూడు లక్షల మెట్ల కర్నూలు నుంచి కేసీఆర్ హయాంలో 23లో 40 జిల్లా ధాన్యం ఉత్పత్తి పెరిగిందన్నారు. రైతులను చైతన్యం చేసి పంటలను పండించే ప్రయత్నం చేశారన్నారు. మధ్యలో మోడీ కొనుగోలు చేయనని అంటే ఏకంగా ఢిల్లీలో ప్రభుత్వాన్ని తీసుకెళ్లి ధర్నా చేసిన ఘనత కేసీఆర్ ది అన్నారు. జిల్లాకు చెందిన మంత్రులకు సోలు లేదని విమర్శించారు.ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యే లు భాస్కర్ రావు, గాదరి కోశోర్ కుమార్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఒంటెద్దు నర్సింహా రెడ్డీ, భారీగా త్వరలోచిన రైతులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# గిరిజన గురుకుల ఇంటర్ ప్రవేశాల కౌన్సిలింగ్ పగడ్బందీగా నిర్వహణ

**576 సీట్లు భర్తీ.. మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు : ఐటీడీఏ పీవో బీ రాహుల్**



భద్రాచలం : లోకల్ గైడ్ : తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెక్రటరీ సీతాలక్ష్మి ఆదేశాల మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల గిరిజన గురుకుల విద్యాలయాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బాలికల అడ్మిషన్ల కౌన్సిలింగ్‌ను పగడ్బందీగా నిర్వహించినట్లు



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ రాహుల్ తెలిపారు. సోమవారం భద్రాచలం పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో జరుగుతున్న కౌన్సిలింగ్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొత్తం 576 సీట్లకు పదో తరగతి మార్కుల మెరిట్ ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించి, హాజరైన విద్యార్థినులందరికీ కళాశాలలో సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కౌన్సిలింగ్‌కు వచ్చిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడిన ఆయన, గురుకుల కళాశాలలో సీటు రావడం అదృష్టంగా భావించాలని, ఏ సబ్జెక్టులో అవకాశం వచ్చినా తప్పనిసరిగా అడ్మిషన్ పొందాలని సూచించారు. అనంతరం 561 మార్కులు సాధించిన శ్రీజకు తొలి అడ్మిషన్ ఫారం అందజేసి కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. 395 మార్కుల వరకు సాధించిన విద్యార్థినులకు కూడా అడ్మిషన్లు కల్పించినట్లు తెలిపారు. ఆర్సీఓ గురుకులం అరుణకుమారి, ప్రిన్సిపాళ్ల పర్యవేక్షణలో కౌన్సిలింగ్ ప్రశాంతంగా, ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించబడిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్లు పుల్లమ్మ, రాణి, మాధవీలత, చైతన్య, ఇందిరా ప్రియదర్శిని, గురుకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. - మైనర్ బాలికపై అఘాయిత్యం.



లోకల్ గైడ్/తాండూర్: బాలికను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోలీసులు ఫోక్సో కేసును నమోదు చేశారు. ఈ ఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ప్రకారం... వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట్ మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలిక ప్రస్తుతం తాండూరు పట్టణంలో నివాసం ఉంటోంది.ఆమెకు బంధువైన తాండూరు మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్‌తో పరిచయం ఏర్పడింది. శివకుమార్ బాలికను ప్రేమిస్తున్నానని మాయ మాటలతో లోబరుచుకున్నాడు. అంతేకాకుండా పెళ్లి చేసుకుంటానని నమ్మించి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.ఫలితంగా బాలిక గర్భవతి కావడంతో కుటుంబ సభ్యులు గమనించి నిలదీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.మైనర్ బాలిక తల్లి, ఆదివారం రాత్రి తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడు శివకుమార్‌పై అత్యాచారంతో పాటు బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో) కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# నకిలీ పత్తి విత్తనాల నిందితుడు అరెస్ట్... పరారీలో ఇద్దరు నిందితులు... 316కిలోల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం....




మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)రైతులు ప్రభుత్వం అనుమతించిన పత్తి విత్తనాలనే వినియోగించాలని,అదేవిధంగా లైసెన్సు పొందిన ఎరువుల దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేసి తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని మంచిర్యాల డిసిపి ఎ భాస్కర్ సూచించారు.సోమవారం జైపూర్ ఎసిపి కార్యాలయంలో ఏర్పాటు చసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని డిసిపి పేర్కొన్నారు.భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి 316కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నామని డిసిపి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం భీమారం గ్రామంలోని ఇప్పల బోగడలో ఒక వ్యక్తి తన ఇంట్లో ప్రభుత్వం నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు భీమారం ఎస్ఐ ఎ రాజేందర్,మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తమ సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీలు నిర్వహించగా అతని ఇంట్లో నకిలీ పత్తి విత్తనాలు గుర్తించారు.గత సంవత్సరం కొంతమంది నిందితులతో పరిచయం ఏర్పడిందని,వారు పత్తి విత్తనాల వ్యాపారం ద్వారా అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో అప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తాను వారి వద్ద నుండి కొన్ని విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అధిక ధరలకు విక్రయించగా మంచి లాభాలు వచ్చాయని తెలిపాడు.అదే క్రమంలో ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో కూడా వారి వద్ద నుంచి నకిలీ విత్తనాలను కిలోకు15వందల చొప్పున కొనుగోలు చేసి,రైతులకు ఇవి మంచి రకానికి చెందిన విత్తనాలని,అధిక దిగుబడి వస్తుందని నమ్మబలికి కిలోకు 3వేల చొప్పున విక్రయించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు.తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని ఉద్దేశంతో కొద్ది రోజుల క్రితం పెనుకుల రవి ఆంధ్రప్రదేశ్ కు చెందిన నిందితుడి వద్ద150కిలోల పత్తి విత్తనాలను కొనుగోలు చేసి,ప్రయాణికుల ఆటోలో ఎవరికి అనుమానం రాకుండా 50కిలోల చొప్పున 3విడతల్లో తీసుకొచ్చి,కొంతమందికి విక్రయించి మిగిలిన వాటిని తన ఇంట్లో నిల్వ ఉంచినట్లు తెలిపారు.అదేవిదంగా మరో నిందితుడిని ఈనెల12న ఫోన్ ద్వారా సంప్రదించి 200కిలోల విత్తనాల కోసం 80వేలు అడ్వాన్స్ చెల్లించగా,ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపిస్తే ఎవరికి అనుమానం రాదని చెప్పి పంపించాడని,ఆ విత్తనాలు ఆదివారం అతనికి చేరగా,రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన సమయంలో తమ సిబ్బందికి సమాచారం అందడంతో పట్టుకున్నామని తెలిపారు.వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని అతని ఇంట్లో ఉన్న 7సంచుల్లో మొత్తం 316కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ సుమారు 9లక్షల48వేలు ఉంటాయని,నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.నకిలీ పత్తి విత్తనాలు వాడటం వల్ల భూమి సారవంతం తగ్గిపోవడంతో పాటు భవిష్యత్తులో పంట దిగుబడులు తగ్గే అవకాశముందని తెలిపారు.అలాగే ఈ విత్తనాల వల్ల పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని పేర్కొన్నారు.ముఖ్యంగా హెచ్ టి(బిటి3)నకిలీ విత్తనాల వినియోగం వల్ల రైతులకు చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు.దళారుల మాయమాటలు నమ్మి నకిలీ విత్తనాల బారిన పడవద్దని,ఈ విషయమై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా రవాణా ద్వారా ఎవరైనా నకిలీ విత్తనాలను తరలిస్తున్నట్లు,గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని,సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని డిసిపి తెలిపారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన భీమారం ఎస్ఐ ఎ రాజేందర్,సిబ్బంది పి మల్లయ్య,కె రమేష్,ఎన్ మహేందర్,జయకృష్ణ,ఎన్ అశోక్,హోమ్‌గార్డులు సదాశివ్,సంతోష్,శ్యామ్‌లను డిసిసి ప్రత్యేకంగా అభినందించారు.ఈ సమావేశంలో జైపూర్ ఎసిపి ఎ వెంకటేశ్వర్,జైపూర్ సిఐ కె నవీన్ కుమార్,మండల వ్యవసాయ అధికారి ఎ సుధాకర్,జైపూర్ ఎస్ఐ ఎల్ భూమేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్ ), మే 18 : ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే జిల్లాలో ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేయడం జరుగుతోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల అతిక్రమణను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖల ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. పర్యావరణ అనుమతులు లభించిన తరువాతే పోతంగల్ మండలం హంగర్గా గ్రామ శివారులోని మంజీరా నది నుండి ఇసుక రవాణాకు అనుమతించడం జరిగిందని తెలిపారు. టీజీఎండీసీ ద్వారా నిబంధనలను పక్కాగా పాటిస్తూ ఇసుక రవాణా కొనసాగుతోందని, తన ఆదేశాల మేరకు బోధన్ ఆర్.డీ.ఓ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి ఈ మేరకు నివేదిక అందించారని అన్నారు. వే బిల్లులను క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతోందని, ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకే ఇసుక వాహనాలకు అనుమతిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు టీజీఎండీసీ ద్వారా కొనసాగుతున్న కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించడం జరుగుతోందని, తూకంలో తేడా లేకుండా, ఓవర్ లోడ్ కు ఆస్కారం లేకుండా సీసీ కెమెరా ద్వారా నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. జీ.పీ.ఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ద్వారా ఇసుక లోడ్ తో కూడిన వాహనం ఎక్కడి నుండి ఎక్కడికి వెళ్తోంది అన్నది ఆన్లైన్ లో టీజీఎండీసీ ప్రధాన కార్యాలయంలో గమనించడం జరుగుతోందని అన్నారు. జిల్లాలోని మిగతా ఇసుక రీచ్ ల నుండి మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా ట్రాక్టర్లలో ఇసుక రవాణాకు అనుమతించడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులను సమన్వయము చేసి విస్తృత తనిఖీలు జరిపిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పారదర్శకంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

## సమ్మర్ లోనే గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులు చేపట్టాలి:

-బీజేపీ డిమాండ్



పెద్దపల్లి , మే 18: (లోకల్ గైడ్ )పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సూచనల మేరకు ఇంధన వినియోగాన్ని తగ్గించి ప్రభుత్వ రవాణా వ్యవస్థను ప్రోత్సహించే ఉద్దేశంతో బీజేపీ నాయకులు టీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, జిల్లాలోని అనేక గురుకుల పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా బాలికలు పరిశుభ్రత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్న ఆమె, విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని గురుకులాల్లో మరుగుదొడ్ల మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సులువ లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్, బోడకుంట సుభాష్, ఊరగొండ అపర్ణ, పాకాల నరసింహారెడ్డి, కోడూరి రమేష్, ఏరుకొండ తిరుపతి, కొమిరే లక్ష్మణ్, మీస వికాస్, శిలారపు కళ్యాణ్, గన్న శ్రీనివాస్, కొట్టే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐదు నెలలుగా చుక్కనీరు లేదు.

- మిషన్ భగీరథ నీరు రాక కాలనీవాసుల తీవ్ర ఇబ్బందులు.
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.
- వార్డు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోని వైనం.
- తక్షణమే తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసుల డిమాండ్.



లోకల్ గైడ్/తాండూర్: పాత తాండూర్ పరిధిలోని 15వ వార్డులో గత ఐదు నెలలుగా మిషన్ భగీరథ త్రాగునీరు సరఫరా కాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న మిషన్ భగీరథ నీళ్లు ఈ వార్డులో పూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు నెలల నుంచి తాగునీరు లేక మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోజువారీ అవసరాల కోసం దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని కాలనీవాసులు చెబుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు, వార్డు కౌన్సిలర్‌కు సమస్య వివరించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో నీటి సరఫరా లేక పక్క కాలని, ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఐదు నెలలుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని స్థానికులు మండిపడుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు, వార్డ్ కౌన్సిలర్ స్పందించి 15వ వార్డుకు మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, లేదంటే కాలి బిందెలతో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## పేట లో అక్రమ పశువుల రవాణాను అడ్డుకున్న పోలీసులు



నారాయణపేట మే 18:లోకల్ గైడ్/నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట చెక్ పోస్టు వద్ద నారాయణపేట పోలీసులు విధులు నిర్వ హిస్తున్న సమయంలో సోమవారం మధ్యాహ్నం సుమారు 12:00 గంటలకు యాద్గిరి నుండి నారాయణ పేట వైపు వస్తున్న అశోక్ లేలాండ్ వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా వాహనం నంబర్ కే ఏ -33-36162 లో పరిమి తికి మించి ప్రమాదకర పరిస్థితుల్లో 3 ఎద్దులు,1 గేదె, 1 బర్రెపోతును తరలి స్తున్నట్లు గుర్తించారు. పశు వుల రవాణాకు సంబం ధించిన ఎటువంటి అను మతి పత్రాలు లేకుండా వాహనాన్ని అజాగ్రత్తగా నడుపుతూ తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వాహన డ్రైవర్‌ను విచారిం చగా అతను అబ్దుల్ వహీద్ గుర్మిత్కల్, కర్ణాటక కు చెందిన వ్యక్తిగా తెలిపాడు. పట్టుబడిన పశువులను తాత్కాలిక గోశాలకు తర లించి, డ్రైవర్‌పై కేసు నమో దు చేసినట్లు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఎఫ్ సెట్ ఫలితాలలో నల్గొండ పట్టణం ఆల్ఫా కళాశాల ప్రభంజనం సృష్టించారు.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి .మే 18. (లోకల్ గైడ్)ఎఫ్ సెట్ ఫలితాలలో నల్లగొండ పట్టణంలోని ఆల్ఫా కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు . లహరిక 11.915 ,భరత్ కుమార్ 21.627, రేష్మ చైతన్య 24.113, రోహిత్ వర్మ 26. 426, అక్షయ 26 .970, లక్ష్మి అవంతిక 30371 ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఆల్ఫా విద్యాసంస్థల చైర్మన్ భాను నరసింహ గౌడ్ ప్రిన్సిపాల్ రవికుమార్, ఆధ్యాత్మికులు శ్రీనివాస్. ప్రేమ్ సాగర్ ,శేఖర్ రెడ్డి, లింగస్వామి, యాదగిరి రాజు అభినందించారు

## చలివేంద్ర కేంద్రాలకు ఉచిత తాగునీటి సరఫరా కల్పించాలని హెచ్ఎండబ్ల్యు ఎస్ఎస్ బి అధికారులకు వినతి

ప్రజల దాహార్తి తీర్చేందుకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న..బోయిని మహేష్ యాదవ్



శేరిలింగంపల్లి, మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): వేసవి ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో హాఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన చలివేంద్ర కేంద్రాలకు ఉచితంగా తాగునీటి సరఫరా కల్పించాలని హెచ్ఎం డబ్ల్యుఎస్ఎస్ బి హాఫీజ్‌పేట్ డివిజన్ జనరల్ మేనేజర్ గారిని బోయిని మహేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ప్రజలు తీవ్రమైన ఎండలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా నాలుగు ప్రాంతాల్లో చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్ర కేంద్రాలు కేకేఎస్ బేకరి--2 సమీపంలో, హాఫీజ్‌పేట్ చెరువు కట్ట బతుకమ్మ కుంట వద్ద, ఆల్విన్ కాలనీ చౌరస్తా వద్ద, అలాగే హాఫీజ్‌పేట్ డి-మార్ట్ సమీపంలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాలలో ప్రతిరోజూ సుమారు 12 డ్రమ్ముల తాగునీటి అవసరం ఉంటోందని వివరించారు. ప్రజా సేవా దృక్పథంతో కొనసాగిస్తున్న ఈ కార్యక్రమానికి హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్ బిశాఖ సహకారం అందించి, ఉచితంగా నీటి ట్యాంకర్ సదుపాయం కల్పించాలని వినతిలో కోరారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని బోయిని మహేష్ యాదవ్ అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రజల కోసం సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

## పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ కు ఘన సన్మానం...



మంచిర్యాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్)బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ నూతన అధ్యక్షులు బండి ప్రభాకర్ ను బెల్లంపల్లి మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సన్మానించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతు బండి ప్రభాకర్ నిత్యం ప్రజల మధ్య తిరుగుతు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. అంతేకాకుండా నియోజకవర్గంలో ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తు అందరికీ అందుబాటులో ఉండే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు భావోద్వేగానికి గురయ్యారు. తనపై చూపుతున్న అభిమానానికి,విశ్వాసానికి ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పదవి అనేది బాధ్యత మాత్రమే అని,ప్రజల ప్రేమే నాకు అసలైన బలం అని,తాను ఎప్పటికీ ఓ సాధారణ కార్యకర్తగానే ప్రజల్లో ఉంటాను అని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యత అప్పగించిన బెల్లంపల్లి అభివృద్ధి ప్రదాతబెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ కు ఎప్పటికీ రుణపడి ఉంటాను అని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి త్వరలోనే పట్టణ కమిటీలు వేసేందుకే సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు,సీనియర్ నాయకులు మల్లారపు చిన్న రాజం,తొంగల మల్లేష్,మంతెన కొమురయ్య,మంచిర్యాల జిల్లా టిపిసిసి మీడియా కమ్యూనికేషన్స్ కన్వీనర్‌దేవసాని ఆనంద్,టేకుల బస్తి ఇంచార్జి కన్నూరి వెంకటేష్, దెబ్బేటి రమేష్, జమ్మికుంట విజయ్ జిల్లా సెక్రెటరీ జమ్మికుంట విజయ్,వెంకట్ యాదవ్,సాయి కిరణ్ యాదవ్,పట్టణ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

## మియాపూర్ 108 డివిజన్ ప్రజా సమస్యలపై డిప్యూటీ కమిషనర్‌కు వినతి

-రోడ్ల మరమ్మతులు, ప్యాచ్ వర్క్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్



శేరిలింగంపల్లి, మే 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ): మియాపూర్ 108 డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలపై డిప్యూటీ కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్ల దుస్థితి, రోడ్డు మరమ్మతులు, ప్యాచ్ వర్క్ పనుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ మాట్లాడుతూ..ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారిన దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. ముఖ్యంగా వర్షాకాలం దృష్ట్యా రోడ్లపై ఏర్పడిన గుంతల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకొని, రోడ్డు రిపేర్, ప్యాచ్ వర్క్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుండె గణేష్ ముదిరాజ్, జాజి రావు, రాము, దర్గా శేఖర్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మై భారత్ ఆధ్వర్యంలో ఐదురోజుల ఈఎల్పి ప్రారంభం




రంగారెడ్డి జిల్లా బ్యూరో, ( లోకల్ గైడ్ ): మై భారత్ ఆధ్వర్యంలో ఐదు రోజుల ఈ ఎల్పి ప్రారంభిస్తున్నట్లురంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, మైభారత్ ఉపసంచాలకురాలు స్నేహల్ బతుకర్ లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వము యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ అనుబంధంగా పనిచేసే మైభారత్ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ అనుబంధంగా పనిచేసే మైభారత్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో 18 నుంచి 22వ తారీకు వరకు ఐదు రోజులపాటు ఐదు మంది యువతి యువకులకుఅనుభవ పూర్వకమైన అభ్యాసం కార్యక్రమాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్ లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ ఉప సంచాలకులు స్నేహల్ బతుకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైభారత్ వాలంటీర్లు ఆరిఫ్ మోహన్ నాయక్. అఖిల శ్రీమతి మంజుల. శ్రీశైలం. కౌశిక్ పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్పోర్ట్లో కార్గో ఎయిర్టెల్-2 ప్రారంభం



శంషాబాద్ ,మే 18, ( లోకల్ గైడ్);జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యాధునిక కార్గో టెర్మినల్-2ను సోమవారం ప్రారంభించినట్లు ప్రకటించింది. ప్రపంచ స్థాయి ఎయిర్ కార్గో మరియు లాజిస్టిక్స్ కేంద్రంగా విమానాశ్రయ అభివృద్ధిలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. దేశీయ మరియు అంతర్జాతీయ కార్గో రవాణా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఎయిర్‌లైన్స్, ఫ్రైట్ ఫార్వార్డర్స్, లాజిస్టిక్స్ ఆపరేటర్లు మరియు నియంత్రణ సంస్థలకు అత్యాధునిక మౌలిక సదుపాయాలను అందించేందుకు , అత్యవసర ప్రాణ రక్షక ఔషధాల



రవాణాకు ఈ టెర్మినల్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా ఎయిర్పోర్ట్ సీఈవో కదీర్ కది వరుణ్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో కార్గో సర్వీస్ లో అందించడంలో ఒక కీలకమైలురాయిగా మారుతుందని తెలియజేశారు. ఎయిర్పోర్ట్ కార్గో అండ్ లాజిస్టిక్స్ సీఈవో సంజీవ్ ఎడ్వర్డ్ మాట్లాడుతూ ప్రాంత ఆర్థిక అభివృద్ధి, వివిధ పరిశ్రమల ఉత్పత్తుల రవాణా సౌకర్యానికి కార్గో అత్యధిక సేవలు అందుబాటులో రానున్నాయని పేర్కొన్నారు

## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ ..



బెల్లంపల్లి (లోకల్ గైడ్)..మధురిమ సంతోష్ ల ప్రధమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యులు కందుల మహర్షి సహకారంతో తిలక్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం పట్టణంలో అంబలి పంపిణీ చేశారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ఏరియాలో భవన నిర్మాణ కార్మికులకు నిరుపేదలకు కూలీలకు ఆటో డ్రైవర్లకు బాటసారులకు చిరు వ్యాపారస్తులు సుమారు 500మందికి ఉచితంగా అంబలి పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పలువురు దాతల సహకారంతో ప్రతిరోజు అంబలి పంపిణీ ద్వారా ప్రజల దాహాన్ని తీర్చే ప్రయత్నం చేస్తున్నామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కజ్జం రమేష్,మాదరబోయిన రాజేందర్,గంట శ్రీనివాస్,ఎం సారయ్య,నాగుల లింగయ్య,కందుల సత్తయ్య,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సల్బత్తాపూర్ నీటి సమస్యపై కలెక్టర్ స్పందన.



లోకల్ గైడ్/బంట్వారం మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మంచినీటి సమస్యపై జిల్లా అధికారులు స్పందించారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన కావలి నర్సిములు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జడ్పీ సీఈఓ సుధీర్ సంబంధిత అధికారులను వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇంట్రా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఏడబ్ల్యుఈ బంట్వారం దీరజ్, ఇంట్రా ఈఈ రవికుమార్‌లకు ఫోన్ ద్వారా సమాచారం అందించి, వాట్సాప్ ద్వారా వినతిపత్రం పంపించారు. గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్ ఏర్పాటు కోసం ఎస్టిమేట్ సిద్ధం చేసి త్వరితగతిన కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. త్వరలోనే గ్రామ ప్రజలకు మంచినీటి సమస్య నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

